నేటి కందం- నేటికి అందం

రేగుచ మొదటి విమానము
భోగాపురమునకు వచ్చి బుధజన నుతమై
భోగివిభూషణు దయతో
వేగిరముగ పనులు జరుగు విధమును దెలిపెన్ !!

(భోగాపురం ఎయిర్ పోర్టు పనులు శరవేగంతో జరిగి మొదటి విమానం పౌరయాన మంత్రిని అధికారులను తీసుకొని వచ్చి పనులు ఎలా వేగవంతం అవుతాయో నిరూపించడమే కాక భవిష్యత్తులో విమానయాన శిక్షణ సంస్థగాకూడా రూపుదిద్దుకో బోతున్నది.)

-రాధశ్రీ
సెల్:9494481210



# నేటి నిజం
తెలుగు దినపత్రిక

website:www.netinijam.com ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail:netinijam93@gmail.com

నీళ్లపైన అబద్దాలు
నిజాలేంటో తేల్చుకోండి
అప్పుడే మాటలన్నీ
ఆగకుండా పేల్చుకోండి
తెలంగాణకన్యాయం
తెస్తే జనం ఊరుకోరు
పార్టీ ఏదైనా గానీ
పారదోల మానుకోరు

చురక



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ మంగళవారం 6-1-2026 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93 Postal No.HQ/SD/258/2024-2026. Posting at BPC-IV, Patrika channel, Nampally, Hyderabad-500 001. సంపుటి :32 సంచిక:122 పేజీలు:6 వెల: రూ.1/-


## మరిన్ని అత్యున్నత శిఖరాలను అధిరోహించండి..

### -తెలంగాణ కీర్తిని దశ దిశలా చాటండి



హైదరాబాద్, జనవరి 5:భారత రాష్ట్రపతిచే బాల్ పురస్కార్ అవార్డు2025 అందుకున్న మాస్టర్ కార్తికేయ్, ఆయన కుటుంబ సభ్యులతో కలిసి తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ వద్దకు ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ మేడ్చల్-మల్కాజ్‌గిరి జిల్లా శాఖ చైర్మన్ డా. ఎస్.ఎం. రాజేశ్వర్ రావు తీసుకెళ్లారు.

ఈ సందర్భంగా రాజేశ్వరరావు మాస్టర్ కార్తికేయ్ భారతదేశంలోనే అతి పిన్న వయసులో, అలాగే ప్రపంచంలో రెండవ అతి పిన్న వయసు పర్వతారోహకుడిగా ప్రతిష్టాత్మకమైన సెవెన్ సమ్మిట్స్ఛాలెంజ్‌ను 16 ఏళ్ల వయసులో విజయవంతంగా పూర్తి చేశారని వివరించారు.

ఆయన 11 ఏళ్ల వయసులోనే తన పర్వతారోహణ ప్రయాణాన్ని ప్రారంభించి ఈ అసాధారణ విజయాన్ని సాధించేందుకు ఎదురైన కష్టాలు, క్రమశిక్షణ, పట్టుదల గురించి గవర్నర్‌కు వివరించారు. తెలంగాణ రాష్ట్ర గవర్నర్ మాస్టర్ కార్తికేయ్ సాధించిన ఈ అసాధారణ విజయాన్ని అభినందిస్తూ, ఆయన ధైర్యసాహసాలు, దృఢ సంకల్పాన్ని ప్రశంసించారు. రాబోయే రోజుల్లో ప్రపంచంలో మరిన్ని ఉన్నత పర్వతారోహణలు అధిరోహించి దశ దిశలో పేరు ప్రఖ్యాతలు సాధించాలని గవర్నర్ ఆకాంక్షించారు.

అంచలంచలమైన ఆత్మవిశ్వాసంతో ప్రపంచ హద్దులు దాటుతూ అత్యున్నత శిఖరాలను అధిరోహించడం అసామాన్యమని ప్రశంసించారు. అతిపిన్న వయసులో అత్యున్నత శిఖరాలను అధిరోహించి ప్రపంచంలోనే నంబర్ వన్ గా నిలవాలని సూచించారు. ఆ లక్ష్యం సాధించేవరకు కృషి పట్టుదలతో ముందుకెళ్లాలని గవర్నర్ అభిప్రాయపడ్డారు. అంతేకాకుండా ఇలాంటి ప్రతిభావంతమైన యువ విజయవంతులకు తగిన ప్రోత్సాహం అందించాలని ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, మెడ్చల్?మల్కాజ్‌గిరి జిల్లా శాఖ చైర్మన్‌ని ఆదేశించారు. కార్తికేయకు తన వంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని గవర్నర్ పేర్కొన్నారు.

## ప్రియుడి మోజులో పడి భర్తను దారుణంగా చంపి.. హార్ట్ఎటాక్ అని నాటకమాడింది

నిజామాబాద్, జనవరి 5: మక్లూర్ మండలం బొర్గాంలో దారుణ ఘటన వెలుగు చూసింది. ప్రియుడి మోజులో పడి భార్య కట్టుకున్న భర్త ను నిర్దాక్షిణ్యంగా ఉరేసి చంపింది. స్థానికంగా ఈ ఘటన తీవ్ర కలకలం రేపింది. పట్టాటి రమేశ్ (35) భార్య సౌమ్య ఓ ప్రైవేట్ స్కూల్లోఉద్యోగం చేస్తుంది. అదే స్కూల్‌లో పీఈటీ గా పనిచేస్తున్న దిలీప్‌తో పరిచయం ఏర్పడింది. ఆ పరిచయం కాస్త వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ విషయం భర్త రమేశ్ కి తెలియడంతో ఇద్దరికీ గట్టి వార్నింగ్ ఇచ్చాడు. ఈ క్రమంలోనే తన భర్త అడ్డు తొలగించుకోవాలని నిర్ణయించుకుంది సౌమ్య. గత నెల 20న తన ప్రియుడు దిలీప్‌తో కలిసి రమేష్‌ని ఇంట్లోనే టవల్‌తో ఉరేసి హత్య చేసింది. అనంతరం ఏమీ తెలియనట్లుగా తన భర్త గుండెపోటుతో చనిపోయాడని బోరున విలపిస్తూ ఎవరికీ అనుమానం రాకుండా అందరినీ నమ్మించి హడావుడిగా అంత్యక్రియలు పూర్తి చేసింది.

అంత్యక్రియల సమయంలో గ్రామస్థులు రమేశ్ మెడపై గాట్లు ఉండటం గమనించారు. అనుమానం వచ్చి వెంటనే ఇజ్రాయెల్‌లో ఉంటున్న అతని తమ్ముడు కేదారికి సమాచారం అందించారు. కేదారి వెంటనే అప్రమత్తమై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అసలు గుట్టు బయట పడింది. పోలీసులు మృతదేహాన్ని వెలికితీసి విచారింగా.. తమ అక్రమ సంబంధానికి అడ్డు వస్తున్నాడన్న కారణంతోనే హత్య చేసినట్లు రమేశ్ భార్య సౌమ్య ఒప్పుకుంది. ఈ కేసులో పోలీసులు సౌమ్యతోపాటు మరో ఐదుగురు నిందితులను అరెస్ట్ చేశారు. పదమూడేళ్ల వైవాహిక బంధం, ముగ్గురు పిల్లలు ఉన్నారన్న కనీస జ్ఞానం లేకుండా మధ్యలో వచ్చిన ప్రియుడి కోసం భర్తను అన్యాయంగా చంపిన సౌమ్యకు కఠినమైన శిక్ష పడాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు.

## ఏపీ ప్రాజెక్టులపై మంత్రి ఉత్తమ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, జనవరి 5: ఏపీ ప్రాజెక్టులపై తెలంగాణ నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. పోలవరం- నల్లమల్ల సాగర్ ప్రాజెక్టులను తాము అన్ని ఫోరమ్‌లలో వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశారు. మాజీ మంత్రి హరీశ్‌రావు చూపిస్తున్న లేఖ ఈ ప్రాజెక్టులకు సంబంధించినది కాదని క్లారిటీ ఇచ్చారు. పోలవరం- నల్లమల్ల ఇంటర్ స్టేట్ రూల్స్‌కు వ్యతిరేకమని జీఆర్ఎంబీకి తావే లేఖ రాశామని ప్రస్తావించారు. తమ అభిప్రాయాన్ని జీఆర్ఎంబీ కూడా సమర్థించిందని గుర్తుచేశారు. ఇవాళ(సోమవారం) అసెంబ్లీ మీడియా పాయింట్‌లో చిట్ చాట్ చేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.



పోలవరం- నల్లమల్ల ప్రాజెక్టును మహారాష్ట్ర, కర్ణాటక కూడా వ్యతిరేకిస్తున్నాయని తెలిపారు. సుప్రీంకోర్టులో తెలంగాణ వాదనలను బలంగా వినిపించాలని న్యాయవాది అభిషేక్ సింఘీ్వకి సూచించామని పేర్కొన్నారు. ఈ కేసును వచ్చే సోమవారానికి సుప్రీంకోర్టు వాయిదా వేసిందని తెలిపారు. రిట్ పిటిషన్‌లో కాదని.. సూట్ పిటిషన్‌లో రావాలని తమకు సుప్రీంకోర్టు సూచించిందని అన్నారు. ఈ కేసులో స్టే ఇవ్వాలని సుప్రీంకోర్టును వచ్చే సోమవారం కోరుతామని తెలిపారు. వచ్చే విచారణకు తాను కూడా ప్రత్యక్ష్యంగా హాజరవుతానని స్పష్టం చేశారు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి.

ఒకటి, రెండు రోజుల్లో మరోసారి న్యాయవాదులతో సమావేశం అవుతామని వెల్లడించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాకే రాయలసీమ ఎత్తిపోతల పథకం నిలిపివేశారని స్పష్టం చేశారు. గతంలో ఈ పథకం ఆగిపోయి ఉంటే బీఆర్ఎస్ ప్రభుత్వం ఎందుకు చెప్పలేదని ప్రశ్నల వర్షం కురిపించారు. తమ ఒత్తిడి వల్లే ఏపీ ప్రభుత్వం రాయలసీమ ఎత్తిపోతల పథకం పనులు ఆపేసిందని తేల్చిచెప్పారు. బీఆర్ఎస్ హయాంలో కృష్ణ-గోదావరి జలాల్లో తెలివి ఎక్కువ.. పని తక్కువ అని చెప్పుకొచ్చారు. అతి తెలివితో బీఆర్ఎస్ తెలంగాణకు భారీ నష్టం చేసిందని ధ్వజమెత్తారు. కేసీఆర్ హయాంలో పాలమూరు - రంగారెడ్డిని జూరాల నుంచి శ్రీశైలానికి మార్చి, తుమ్మిడిహెట్టి నుంచి మేడిగడ్డకు కాళేశ్వరాన్ని మార్చి భారీ నష్టం చేశారని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## భార్య వేధింపులు తాళలేక భర్త ఆత్మహత్య..

మహబూబాబాద్, జనవరి 5: జిల్లాలోని తాళ్ఊకల్లు గ్రామంలో విషాదం చోటు చేసుకుంది. భార్య వేధింపులు భరించలేక భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మరిపెడ మండలం తాళ్ళఊకల్లు గ్రామానికి చెందిన కళ్ళం నవీన్ కి గత 8 నెలల క్రితం మానస అనే యువతితో వివాహం జరిగింది. పెళ్లైన నాటి నుంచి భార్య, భర్తల మధ్య నిత్యం ఘర్షణలు జరుగుతుండేవి.

ఈ క్రమంలోనే భార్య మానస పుట్టింటికి వెళ్లింది. కాపురానికి రమ్మని అడిగితే రావడం లేదని భర్త నవీన్ మనస్తాపానికి గురయ్యాడు. పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా, భార్య మానస నిత్యం వేధింపులకు పాల్పడేదని స్థానికులు చెబుతున్నారు. ఆమెపై చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు, స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

## కాళేశ్వరం కట్టాకే తెలంగాణ ప్రజలు నీళ్లు తాగుతున్నారా...

### -బిఆర్ఎస్ పార్టీ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పై నిప్పులు చెరిగిన జగ్గారెడ్డి

హైదరాబాద్ జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: దివంగత ప్రధాన మంత్రి నెహ్రూ గాంధీ హయంలో నాగార్జునసాగర్, శ్రీశైలం ప్రాజెక్టులు, సింగూరు, మంజీరా డ్యామ్ లు కాంగ్రెస్సే నిర్మించిందని పిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి తెలిపారు. బిఆర్ఎస్ పార్టీ ఆఫీసులో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ పెట్టారని అన్నారు. ఈ సందర్భంగా గాంధీభవన్ లో ఆయన మీడియాతో మాట్లాడుతూ. హైదరాబాద్ ప్రజలకు సింగూరు, మంజీరా డ్యామ్ ల ద్వారా తాగునీరు సరఫరా అయ్యిందని, కాళేశ్వరం కట్టాకే తెలంగాణ ప్రజలు నీళ్లు తాగుతున్నట్టు బిఆర్ఎస్ ప్రచారం చేస్తోందని తెలియజేశారు. అదే విషయాన్ని అసెంబ్లీకి వచ్చి ఎందుకు మాట్లాడలేదని జగ్గారెడ్డి ప్రశ్నించారు. కృష్ణా జలాలపై సిఎం రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వాస్తవాలు మాట్లాడారని, మంజీరా, సింగూరు నీళ్లు తాగే మాజీ సిఎం కెసిఆర్, మాజీ మంత్రి హరీష్ రావు పెద్దయ్యారని చురకలంటించారు. ఇప్పుడు ఆ డ్యామ్ లు కట్టిన కాంగ్రెస్ నే తిడుతున్నారని, కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా పనులను 90 శాతం పూర్తి చేసింది కాంగ్రెస్సే అని పేర్కొన్నారు. ఆంధ్రవాళ్లను తిట్టింది వాళ్లేనని, బిఆర్ఎస్ అధికారంలో ఉన్న పదేళ్లలో ఎప్పుడైనా ఆంధ్రోళ్లు నీళ్లు దోచుకున్నారని ఎందుకు అనలేదు.. అని జగ్గారెడ్డి ప్రశ్నించారు.

## జ్యోతిర్వాస్తు విద్యాపీఠం ఆధ్వర్యంలో హెల్త్ క్యాంప్

### -స్వచ్ఛంద రక్తదాన శిబిరాన్ని ప్రారంభించిన టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి



సంగారెడ్డి జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి సారథ్యం లో, ఫసల్ వాది లోని జ్యోతిర్వాస్థు విద్యాపీఠం లో స్వచ్ఛంద రక్త దాన శిబిరం, ఉచిత హెల్త్ క్యాంప్ నిర్వహించారు. హెల్త్ క్యాంప్ లో భాగంగా పంటి పరీక్షలు, కంటి పరీక్షలు, ఈసిజి వంటి పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని టీజీఐఐసి చైర్ పర్సన్ నిర్మలా జగ్గారెడ్డి, మహేశ్వర శర్మ సిద్ధాంతి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రక్త దానం ద్వారా ఎంతో మంది ప్రాణాలను కాపాడవచ్చాన్నారు. రక్తదానం అన్ని దానాల కంటే విలువైనదని, ముఖ్యమైనదన్నారు. ప్రతీ ఒక్కరూ రక్త దానానికి ముందుకు రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రెడ్ క్రాస్ సొసైటీ ప్రతినిధులు, ప్రముఖ వైద్యుడు డాక్టర్ శ్రీధర్, సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది, విద్యాపీఠం సేవకులు పాల్గొన్నారు






## బీసీల సంఘటిత పోరాటంతోనే రాజ్యాధికారం సాధ్యం

### -తెలంగాణలో బీసీలకు అట్రాసిటీ చట్టం అమల్లోకి తేవాలి
### -రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలి
### -డా. వకుళాభరణం కృష్ణ మోహన్ రావు

హైదరాబాద్ జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశ జనాభాలో అధిక శాతం ఉన్న బీసీలకు రాజకీయ అధికారంలో తగిన ప్రాతినిధ్యం లేకపోవడం ప్రజాస్వామ్య వ్యవస్థలో ఒక స్పష్టమైన లోపంగా మారిందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ మాజీ చైర్మన్ డా. వకుళాభరణం కృష్ణ మోహన్ రావు అన్నారు. బీసీలకు రాజ్యాధికారం దానం కాదని, సంఘటితంగా ముందుకు వచ్చినప్పుడే రాజకీయ అధికారం సాధ్యమవుతుందని అన్నారు. సంఖ్యలో ఉన్న బలాన్ని రాజకీయ నిర్ణయాధికారంగా మార్చుకోకపోతే, బీసీలు వ్యవస్థలో వెనుకబడిన స్థితిలోనే కొనసాగుతారని స్పష్టం చేశారు.జనాభా గణనలో కులగణన చేపట్టాలని నిర్ణయం తీసుకున్న ప్రధాని శ్రీ నరేంద్ర మోదీకి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ నిర్ణయం భవిష్యత్తులో బీసీలకు సంబంధించిన విధాన నిర్ణయాలకు కీలక ఆధారంగా నిలుస్తుందని, సామాజిక న్యాయం దిశగా ఇది ఒక ముఖ్యమైన ముందడుగని అన్నారు.తెలంగాణ రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న వివక్ష, దౌర్జన్యాలను నివారించేందుకు బీసీలకు ప్రత్యేక



అట్రాసిటీ చట్టాన్ని తక్షణమే అమల్లోకి తేవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. బీసీలకు భద్రత లేకుండా సామాజిక న్యాయం సాధ్యం కాదని చెప్పారు.అలాగే, రాబోయే అన్ని స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయకుండా ఎన్నికలకు వెళ్లడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని పేర్కొన్నారు. జనాభా ప్రాతిపదికన రాజకీయ ప్రాతినిధ్యం కల్పించకపోతే అది రాజ్యాంగ ఆత్మకు విరుద్ధమని అన్నారు.ఈ సందర్భంగా ఆయన ప్రజాస్వామ్యానికి సంబంధించిన మౌలిక సూత్రాన్ని గుర్తు చేస్తూ "సామాజిక ప్రజాస్వామ్యం బలపడితేనే..రాజకీయ ప్రజా స్వామ్యం నిలబడుతుం దని..సా మాజిక న్యాయం లేకుండా.. ప్రజాస్వామ్యం సంపూర్ణం కాబోద"న్నారు.ఇప్పటివరకు ఫూలే దంపతులు, పెరియార్, నారాయణ గురు, రామ్ మనోహర్ లోహియా, కర్పూరీ ఠాకూర్, డా. బీఆర్ అంబేడ్కర్ వంటి మహనీయులు కలగన్న సామాజి క సమానత్వ లక్ష్యాలు ఇంకా పూర్తిస్థాయిలో అమలుకాలేదని ఆయన అన్నారు. ఆ లక్ష్యాల సాధన కోసం బీసీల ఐక్యత మరింత బలపడాల్సిన అవసరం ఉందని పిలుపునిచ్చారు.

## అమెరికా ఉపాధ్యక్షుడు జేడీవాన్స్ నివాసంపై దాడి

వాషింగ్టన్, జనవరి 5: అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ నివాసంపై దాడి జరిగింది. ఒహాయోలోని ఆయన నివాసంపై సోమవారంనాడు ఈ దాడి జరిగింది. ఈ ఘటనకు సంబంధించి ఒక వ్యక్తిని పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

దాడి జరిగిన సమయంలో జేడీ వాన్స్, ఆయన కుటుంబ సభ్యులు ఇంట్లో లేరని మీడియా కథనాలు వెల్లడించాయి. ఈ దాడిలో ఆయన ఇంటి అద్దాలు పగిలాయి. వాన్స్, ఆయన కుటుంబ సభ్యులను లక్ష్యంగా చేసుకుని ఈ దాడి చేశారా, వేరే కారణం ఏదైనా ఉందా అనే దానిపై విచారణ జరుగుతోంది. ఈ ఘటనపై ఉపాధ్యక్షుడు కానీ, వైట్ హౌస్ కానీ వెంటనే స్పందించలేదు.

## షిరిడి సాయి క్యాలెండర్ ఆవిష్కరణ



హైదరాబాద్, జనవరి 04 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ); నాంపల్లి ఆలిండియా ఇండస్ట్రియల్ ఎగ్జిబిషన్ సొసైటీ ఆధ్వర్యంలో, షిరిడి సాయిబాబా మందిరంలో శ్రీ సాయి ప్రచార సేవ సంస్థ క్యాలెండర్ ఆవిష్కరణ జరిగింది.ఏఏ3 కార్యక్రమం లో క్యాలెండర్ ఆవిష్కరించిన షిర్డీ ప్రధాన పూజారి శ్రీ మనోహర్ పాటక్ , సాయి సేవ ప్రచార మందిరం తరుపున, సాయి ప్రచార కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్ రెడ్డి,గోరక్షణ ఆల్ ఇండియా ప్రచార కమిటీ చైర్మన్ విడియాల సంజయ్ కుమార్, వాసవి గ్రూప్ చైర్మన్ వెంకటేశం గుప్తా, సీనియర్ జర్నలిస్ట్ కే.శాంతి కుమార్ , సాయి భక్తులు , తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# యుద్ధ అనాథలను అక్కున చేర్చుకోలేమా !

## (జనవరి 06 "ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం" సందర్భంగా)

18 సంవత్సరాల కంటే తక్కువ వయస్సు ఉన్న పిల్లలు ఏదైనా కారణం వల్ల తల్లిదండ్రులలో ఒకరిని లేదా ఇద్దరినీ కోల్పోవడాన్ని జఔవిఅఇఈ అనాథగా నిర్వచించింది. తల్లిదండ్రులను కోల్పోవడం చాలా కష్టం, కానీ యుద్ధం కారణంగా తల్లిదండ్రులను కోల్పోవడం మరింత దారుణం. తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లల దుస్థితిని ఒకే రోజుకు పరిమితం చేయలేము, కానీ వారిని జీవితాంతం వేటాడుతూనే ఉంటుంది. ప్రపంచవ్యాప్తంగా, లక్షలాది మంది పిల్లలు యుద్ధం, ఇతర సంఘర్షణల కారణంగా అనాథలుగా మారారు, బాధాకరమైన పరిస్థితులకు గురవుతున్నారు. అనాథాశ్రమాలలో పెరిగే పిల్లలు చాలా భావోద్వేగపరంగా, సున్నితంగా ఉండటానికి కారణాలుగా యుద్ధాలు, కరువుకాటకాలు, వ్యాధులు, పేదరికం లేదా ప్రత్యక్ష గాయాలు వంటి సమస్యలను ఎదుర్కొని ఉండవచ్చు.

ప్రపంచవ్యాప్తంగా 140 మిలియన్ల అనాథలు:

ప్రపంచవ్యాప్తంగా 140 మిలియన్లకు పైగా అనాథలు ఉన్నారు, వీరిలో ఆఫ్రికాలో 52 మిలియన్లు, కరేబియన్ – లాటిన్ అమెరికాలో 10 మిలియన్లు, ఆసియాలో 61 మిలియన్లు, తూర్పు ఐరోపా – మధ్య ఆసియాలో 7.3 మిలియన్లు ఉన్నారు. 95% అనాథలు 5 సంవత్సరాల కంటే ఎక్కువ వయస్సు కలిగిన వారే ఉన్నారు. యుద్ధ మరణాలలో సగం మంది పౌరులు యుద్ధ అనాథలుగా ఆకలి, అనారోగ్యం, పోషకాహార లోపం, నిరక్షరాస్యత వంటి భయంకరమైన పరిస్థితుల్లో జీవిస్తున్నారు. సుమారు 1,50,000 మంది పాలస్తీనియన్లు ఈ ప్రాంతాన్ని విడిచిపెట్టగా, 70,000 మంది వరకు ప్రాణాలు కోల్పోయారని భావిస్తున్నారు, వారిలో సగానికి పైగా మహిళలు మరియు పిల్లలు ఉండడం విచారకరం. అత్యంత దయనీయ స్థితిలో రోడ్లపై నిలబడి ఉన్న అనేక మంది యుద్ధ అనాథలకు భవిష్యత్తు అంధకారంగా మారింది. ఇజ్రాయెల్–పాలస్తీనా యుద్ధం సమయంలో గాజా జనాభా పూర్తిగా తగ్గిపోయింది. 2025 చివరి నాటికి రష్యా ఉక్రెయిన్‌పై దాడి చేసినప్పుడు దాదాపు 53,000 మంది పౌర మరణాలు సంభవించాయి. ప్రస్తుతం ఈ రెండు యుద్ధాల వల్ల అత్యంత దయనీయమైన పరిస్థితుల్లో నివసిస్తున్న యుద్ధ అనాథల సంఖ్య గణనీయంగా పెరిగింది.

ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవం–2026:

యుద్ధ అనాథలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించడానికి, వారి పెరుగుదల సమయంలో వారు ఎదుర్కొనే శారీరక, మానసిక, సామాజిక మార్పులను హైలైట్ చేయడానికి ప్రతి సంవత్సరం జనవరి 06న "ప్రపంచ యుద్ధ అనాథల దినోత్సవాన్ని" జరుపుకుంటారు. యుద్ధం వంటి అకాల, కఠినమైన సంఘటనలలో తల్లిదండ్రులను కోల్పోయిన పిల్లలు బతికి ఉన్న కుటుంబ సభ్యులతో ఉండవలసి రావడం లేదా వారు అనాథాశ్రమాల్లోకి చేరడం, పోషకాహార లోపాలు, వ్యాధుల వ్యాప్తి వంటి దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటారు. ఈ రోజున అనాథాశ్రమాలకు గరిష్టంగా విరాళాలు అందించడం, అనాథలతో కొంత నాణ్యమైన సమయాన్ని గడపడానికి అనాథ గృహాలను సందర్శించడం, అనాథల దుస్థితిపై సాధారణ ప్రజలకు అవగాహన కల్పించడానికి కార్యక్రమాలను నిర్వహించడం వంటివి ప్రణాళిక చేయవచ్చు.

అనాథలకు సొంత తల్లిదండ్రులు లేరు, కానీ వారికి చాలా మంది మనలాంటి సామాజిక తల్లిదండ్రులు ఉన్నారు. ప్రపంచంలో ఒక రొట్టె ముక్క కోసం చనిపోతున్న వారు చాలా మంది ఉన్నారు, కానీ కొంచెం ప్రేమ, వెచ్చని కౌగిలింత కొరవడి చనిపోతున్న వారు ఇంకా చాలా మంది ఉన్నారు. అలాంటి అనాథలను అక్కున చేర్చుకొని మానవత్వం ఇంకా బతికే ఉందని రుజువు చేద్దాం

– ఆచార్య బుర్ర మధుసూదన్ రెడ్డి
9949700037

# చెన్నైలో 9వ సిద్ధ వైద్య దినోత్సవ వేడుకలను ప్రారంభించిన ఉపరాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, జనవరి 5:చెన్నైలో జరిగిన 9వ సిద్ధ వైద్య దినోత్సవ వేడుకలను భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ నేడు ప్రారంభించారు. ఈ సందర్భంగా మహర్షి అగస్త్యునికి నివాళులర్పించిన ఉపరాష్ట్రపతి.. ప్రస్తుత ఆరోగ్య సంరక్షణలో సిద్ధ వైద్య విధానం ప్రాముఖ్యతను ప్రస్తావించారు. సిద్ధ వైద్యం భారతీయ నాగరికత జ్ఞానంలో లోతుగా పాతుకుపోయిన ఒక సజీవ సంప్రదాయమని ఆయన అభివర్ణించారు. దేశ, విదేశాల్లోని సిద్ధ వైద్యులు, పరిశోధకులు, విద్యార్థులు, శ్రేయోభిలాషులకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆయుష్ మంత్రిత్వశాఖ పరిధిలోని సిద్ధ, ఆయుర్వేద, యునాని, యోగా వంటి సంప్రదాయ ఆరోగ్య విధానాలు గతానికి సంబంధించినవి మాత్రమే కావని, కాల పరీక్షను తట్టుకొని నేటికీ లక్షలాది మంది ప్రజల సంక్షేమానికి తోడ్పడుతున్న పద్ధతులని ఆయన పేర్కొన్నారు. శరీరం, మనసు, ప్రకృతి మధ్య సమన్వయంపై ఆధారపడిన సిద్ధ వైద్య విధానం ఆరోగ్యం, నివారణ, సంరక్షణ, జీవనశైలి నిర్వహణకు ప్రాధాన్యత ఇస్తుందని ఆయన తెలిపారు. నేటి ఆధునిక కాలంలో పెరిగిపోతున్న జీవనశైలి వ్యాధులు, ఒత్తిడి, పర్యావరణ సవాళ్లను ఎదుర్కోవడానికి ఈ సంప్రదాయ వైద్యం ఎంతో అవసరమని పేర్కొన్నారు.

సిద్ధ వైద్య ప్రత్యేకతను వివరిస్తూ.. ఇది కేవలం వ్యాధి లక్షణాలకు మాత్రమే కాకుండా, వ్యాధి మూల కారణాలను పరిష్కరించడంపై దృష్టి సారిస్తుందని ఉపరాష్ట్రపతి చెప్పారు. ఈ సమగ్ర విధానం ద్వారా రోగులకు సంపూర్ణ నివారణ, కోలుకుంటామనే ఆశను అందిస్తుందని ఆయన పేర్కొన్నారు.

సంప్రదాయ జ్ఞాన వ్యవస్థలను పరిరక్షించి, ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి అన్నారు.సిద్ధ వైద్యం నైతిక, తాత్విక పునాదులను కాపాడుతూనే, ఆ జ్ఞానాన్ని రక్షించడానికి, ఆధునికీ కరించడానికి, ప్రపంచవ్యాప్తంగా పంచుకోవడానికి పరిశోధకులు, వైద్యులు, విద్యా సంస్థలు సమన్వయంతో పనిచేయాలని ఆయన కోరారు. ముఖ్యంగా, నయం చేయలేని వ్యాధులకు పరిష్కారాలను కనుగొనడానికి సిద్ధ వైద్యంలో శాస్త్రీయ పరిశోధనలు చేపట్టాలని యువ విద్యార్థులను, పరిశోధకులను ఆయన ప్రోత్సహించారు.

ప్రతి వైద్య విధానానికి దాని సొంత బలాలు,ప్రయోజనాలు ఉంటాయని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. మానవాళి ప్రయోజనం కోసం ఆయా వైద్య పద్ధతుల విశిష్టతలను ఉపయోగించుకుంటూ, అన్ని రకాల వైద్య వ్యవస్థల పట్ల సానుకూల, సమ్మిళిత దృక్పథాన్ని అవలంబించాల్సిన ప్రాముఖ్యతను ఆయన వెల్లడించారు.

సిద్ధ దినోత్సవం ఒక ముఖ్యమైన జ్ఞాపికగా పనిచేస్తుందని పేర్కొంటూ.. ఆరోగ్యకరమైన, సమతుల్యమైన, సుస్థిరమైన సమాజాన్ని నిర్మించడానికి సంప్రదాయ జ్ఞానాన్ని ఆధునిక విజ్ఞాన శాస్త్రంతో అనుసంధానించాల్సిన అవసరం ఉందని ఉపరాష్ట్రపతి స్పష్టం చేశారు.

ఈ ఏడాది వేడుకలను "ప్రపంచ ఆరోగ్యానికి సిద్ధ వైద్యం" అనే ఇతివృత్తంతో నిర్వహించారు. సిద్ధ వైద్య పితామహుడిగా పిలిచే అగస్త్య మహర్షి జయంతిని పురస్కరించుకుని ఈ వేడుకలు జరిగాయి. ఈ కార్యక్రమంలో తమిళనాడుతో పాటు ఇతర రాష్ట్రాల నుంచి సిద్ధ వైద్యులు, శాస్త్రవేత్తలు, విద్యావేత్తలు, పండితులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అంతకుముందు ఈ వేదిక వద్ద ఆయుష్ మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేసిన ప్రదర్శనను ఉపరాష్ట్రపతి సందర్శించారు. సిద్ధ వైద్య గ్రంథాలు, పుస్తకాలు, ముడి పదార్థాలు మరియు మూలికా ఔషధాల విస్తారమైన సేకరణను ప్రదర్శించినందుకు ఆయన ఆయుష్ మంత్రిత్వ శాఖను అభినందించారు. ఈ ప్రదర్శన సిద్ధ వైద్య విధానం సుసంపన్నమైన వారసత్వాన్ని ప్రతిబింబిస్తుందని ఆయన పేర్కొన్నారు.

9వ సిద్ధ వైద్య దినోత్సవ వేడుకలను కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ పరిధిలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సిద్ధ, సెంట్రల్ కౌన్సిల్ ఫర్ రీసెర్చ్ ఇన్ సిద్ధ, తమిళనాడు ప్రభుత్వ భారతీయ వైద్య, హోమియోపతి డైరెక్టరేట్ సంయుక్తంగా నిర్వహించాయి.

ఈ సందర్భంగా, సిద్ధ వైద్య రంగంలో విశేషమైన, ప్రశంసనీయమైన కృషి చేసిన అయిదు గురు ప్రముఖులను ఘనంగా సత్కరించారు.

ఈ వేడుకలో కేంద్ర ఆయుష్ మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి (స్వతంత్ర బాధ్యత),కేంద్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ సహాయ మంత్రి శ్రీ ప్రతాప్‌రావు జాదవ్, తమిళనాడు ప్రభుత్వ ఆరోగ్య, వైద్య విద్య, కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి శ్రీ మా సుబ్రమణియన్, ఆయుష్ మంత్రిత్వ శాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి మోనాలిసా దాస్,ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

# అజిత్ సింగ్ నగర్‌లో రోడ్డు ప్రమాదం

**–అతివేగంగా బైక్ నడిపిన బాలుడు**
**–మరో బైక్‌ను ఢీకొట్టడంతో ఇద్దరికి తీవ్ర గాయాలు**
**స్తంభించిన ట్రాఫిక్, స్పందించిన ట్రాఫిక్ పోలీసులు**

అమరావతి, జనవరి 5: విజయవాడ నగరంలోని అజిత్ సింగ్ నగర్, అమెరికన్ హాస్పిటల్ ప్రాంతంలో ఈ రోజు ఉదయం రోడ్డు ప్రమాదం జరిగింది. ఓ బాలుడు బైక్‌ను అతివేగంగా నడుపుతూ మలుపు తిరుగుతున్న మరో బైక్‌ను ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో అదుపు తప్పి ఎదురుగా వస్తున్న ఆటో అద్దంపై పడటంతో అది పగిలి ముందు భాగం తీవ్రంగా దెబ్బతింది.

ఈ ఘటనలో బైక్ నడుపుతున్న బాలుడికి తీవ్ర గాయాలు కాగా, ఢీకొట్టబడిన మరో బైక్‌పై వెళ్తున్న వ్యక్తికీ బలమైన గాయాలయ్యాయి. గాయపడిన వారిని స్థానికులు వెంటనే సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం కారణంగా ఆ ప్రాంతంలో ట్రాఫిక్ స్తంభించడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. సమాచారం అందుకున్న వెంటనే ట్రాఫిక్ పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ట్రాఫిక్‌ను నియంత్రించి వాహనాల రాకపోకలను సవ్యంగా సాగేలా చేశారు. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

# విజయ డెయిరీ వద్ద ఉద్రిక్తత

**–మామ కోడళ్ళ సవాల్**
**–పాల ఉత్పత్తిదారులు చైర్మన్ వర్సెస్ ఆళ్లగడ్డ ఎమ్మెల్యే**
**–పాలకమండలి త్రీ సభ్య కమిటీ సమావేశం**



నంద్యాల, జనవరి 5: నంద్యాల జిల్లాలో విజయ పాల ఉత్పత్తి కర్మాగారంలో రాజకీయ ఆధిపత్య పోరు మొదలైంది. ఆళ్లగడ్డ రాజకీయం నంద్యాల పాల ఉత్పత్తిదారుల కార్యాలయం సంఘానికి చేరుకుంది. ఉమ్మడి కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత పాల ఉత్పత్తిదారుల సంఘం చైర్మన్ పదవిపై టీడీపీ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ పట్టు సాధించేందుకు తన తమ్ముడు జగత్ విఖ్యత రెడ్డికి పదవిని కట్టపెట్టేందుకు పలు ప్రయత్నాలు చేస్తుంది. పాల కేంద్రం వద్ద సోమవారం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. ఈ సందర్భంగా పోలీసులు కూడా భారీ సంఖ్యలో కాపలా ఉన్నారు. ఏ క్షణాన ఏం జరుగుతుందో ఉత్కంఠ రీతిలో పరిస్థితి ఉంది. భూమా అనుచరులు పాల కేంద్రం వద్దకు భారీ సంఖ్యలో చేరుకున్నారు. రెండు వర్గాలు భారీగా అక్కడికి చేరడంతో ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. దీంతో డెయిరీ వద్ద భారీ పోలీస్ బందోబస్తును ఏర్పాటు చేశారు.

ఎలాంటి ఘటనలు జరగకుండా పోలీసుల అప్రమత్తంగా ఉన్నారు. భూమా జగత్ విఖ్యాత రెడ్డి చక్రవర్తుల పల్లె డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. ఆ ఎన్నిక చెల్లదని కమిటీ తీర్మానించడంతో తిరిగి ముత్యాలపాడు సొసైటీ డైరెక్టర్‌గా ఎంపికయ్యారు. దీనిపై ఈరోజు త్రిసభ్య కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేశారు.

గతంలో రూ.1.20 కోట్ల బకాయిలు ఉన్నారని త్రిసభ్య కమిటీ సభ్యులు ఆరోపిస్తున్నారు. ఉదయం హాజరు కావాలని ముత్యాలపాడు సొసైటీ పాలకవర్గ సభ్యులకు నోటీసులు పంపామని సభ్య కమిటీ సభ్యులు పేర్కొంటున్నారు. ఉదయం 11 నుంచి ఒంటిగంట వరకు చూశామని ముత్యాల పాడు సొసైటీ పాలకవర్గ సభ్యులు హాజరు కాలేదని కమిటీ సభ్యులు తెలుపుతున్నారు.

మీడియాతో త్రిసభ్య కమిటీ సభ్యులు గంగుల విజయ్ సింహారెడ్డి, పీపీ మధుసూదన్ రెడ్డి, రవికాంత్ రెడ్డిలు మాట్లాడుతూ డైరెక్టర్లకు మరల ఎన్నికలు జరిపేందుకు తీర్మానం చేస్తుందని తెలిపారు. తుది నిర్ణయం తర్వాత ఎన్నికలకు వెళ్తామన్నారు.

ప్రస్తుత ఆళ్లగడ్డ ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ సొంత మేనమామ ఎస్వీ జగన్మోహన్ రెడ్డి ప్రస్తుతం విజయ పాల ఉత్పత్తి డెయిరీ చైర్మన్ గా ఉన్నారు. వీరి మధ్య గత రెండు సంవత్సరాలుగా ఆధిపత్య పోరు నడుస్తుంది. భూమా అఖిల ప్రియ జేజి నాయన అయినా భూమా నారాయణ రెడ్డి గతంలో 40 సంవత్సరాలుగా విజయపాలు ఉత్పత్తి డెయిరీ చైర్మన్‌గా ఉన్నారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఆళ్లగడ్డకు చెందిన భూమా అఖిలప్రియ మేనమామ ఎస్వి జగన్మోహన్ రెడ్డి పదవి దక్కించుకున్నారు. ఈ వ్యవహారంలో గత ఐదు రోజుల క్రితం సభ్యులను గృహ నిర్బంధం చేసిన సంఘటనపై జిల్లా వైసీపీ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే రోజుల్లో ఏం జరగనుందో కాలమే నిర్ణయించాలి.

# వెల్లూరులో శ్రీ శక్తి అమ్మవారి స్వర్ణోత్సవ వేడుకల్లో పాల్గొన్న భారత ఉపరాష్ట్రపతి

న్యూఢిల్లీ, జనవరి 5:తమిళనాడులోని వెల్లూరులో ఉన్న శ్రీపురంలో నేడు జరిగినశ్రీ శక్తి అమ్మవారి స్వర్ణోత్సవ వేడుకల్లో భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ పాల్గొన్నారు. శ్రీ శక్తి అమ్మ ఆధ్యాత్మిక ప్రయాణానికి 50 సంవత్సరాలు పూర్తైన సందర్భంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగమవ్వడం తనకు అపార ఆనందాన్ని కలిగించిందని ఆయన తెలిపారు.

శ్రీపురం స్వర్ణ దేవాలయం పవిత్రత, ఆధ్యాత్మిక ఔన్నత్యం.. ఆలయాన్ని సందర్శించిన భారత మాజీ రాష్ట్రపతులు డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం, శ్రీ రామ్ నాథ్ కోవింద్, గత నెలలో జరిగిన భారత రాష్ట్రపతి శ్రీమతి ద్రౌపది ముర్ము పర్యటనల ద్వారా ప్రతిబింబిస్తుందని ఉపరాష్ట్రపతి అన్నారు.

ధర్మంపై శ్రీ శక్తి అమ్మ అంకితభావాన్ని ప్రస్తావిస్తూ.. ఆయన మార్గదర్శకత్వం కేవలం ఆధ్యాత్మికతకే పరిమితం కాకుండా సమగ్ర సామాజిక సేవలకుకూడా విస్తరించిందని ఉపరాష్ట్రపతి అన్నారు. ఉన్నత విద్యను అభ్యసించే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించడం, నీటి కొరత ఉన్న ప్రాంతాల్లో తాగునీటి సదుపాయాలు కల్పించడం, విద్యార్థులకు సైకిళ్ల పంపిణీ వంటి దీర్ఘకాలిక కార్యక్రమాలు, అలాగే ప్రతిరోజు వేలాది మందికి భోజనం అందించే అన్నదానం కార్యక్రమం వంటి శ్రీపురంలో చేపట్టిన విస్తృత సేవా కార్యకలాపాలను ఆయన ప్రశంసించారు. ఈ కార్యక్రమాలను నిజమైన భక్తి స్ఫూర్తితో నిర్వహిస్తున్న గొప్ప సేవలుగా ఆయన అభివర్ణించారు.

శ్రీపురం క్యాంపస్‌లో 50,000కి పైగా చెట్లను నాటడం, అలాగే సమీపంలోని కైలాసగిరి కొండలపై లక్షలాది మొక్కలను నాటడంపై ఉపరాష్ట్రపతి హర్షం వ్యక్తం చేశారు. దీనిని భూ తల్లికి, మానవాళికి అందిస్తున్న గొప్ప సహకారమని ఆయన కొనియాడారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ చేపట్టిన పర్యావరణ పరిరక్షణ కార్యక్రమాలకు ఇది గొప్ప బలాన్ని ఇస్తుందని పేర్కొన్నారు. పర్యావరణాన్ని రక్షించడం కూడా ఒక రకమైన దైవిక సేవగా పేర్కొన్నారు.నిజమైన ఆధ్యాత్మికత అనేది కేవలం ఆచారాలు, పూజలు మాత్రమే కాదని... తోటి మానవుల పట్ల ప్రేమ, కరుణ, సేవను కలిగి ఉండటమేనని ఆయన స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత కవి సుబ్రహ్మణ్య భారతి చెప్పిన "ప్రేమను మించిన తపస్సు మరొకటి లేదు" అనే మాటలను ఆయన గుర్తుచేశారు. సమాజాన్ని ప్రేమించడం, సేవ చేయడం ఆధ్యాత్మిక క్రమశిక్షణకు అత్యున్నత రూపమని తెలిపారు.

శ్రీ శక్తి అమ్మను ప్రస్తుత యుగానికి గొప్ప ఆధ్యాత్మిక జ్యోతిగా ఉపరాష్ట్రపతి అభివర్ణించారు. తన జీవితం, పనుల ద్వారా "ప్రేమే దైవం" అనే సూత్రాన్ని నిరూపిస్తూ, సమాజంలో ధర్మాన్ని, ఆధ్యాత్మిక చైతన్యాన్ని శక్తి అమ్మ పెంపొందిస్తున్నారని కొనియాడారు.

# రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి : సీనియర్ సివిల్ జడ్జి సురేశ్




నల్గొండ, జనవరి 5: రోడ్డు భద్రత నిబంధనలు పాటించాలని సీనియర్ సివిల్ జడ్జి కె.సురేశ్ అన్నారు. సోమవారం రోడ్డు భద్రతా దినోత్సవ సందర్భంగా కోదాడ పట్టణంలో ప్రధాన రహదారిపై మండల లీగల్ సెల్ ఆధ్వర్యంలో న్యాయవాదులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ పిలుపు మేరకు రోడ్డు సురక్షా అభియాన్‌లో భాగంగా రోడ్డు భద్రత, చట్టపరమైన అంశాలపై ప్రజలకు అవగాహన కల్పించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. రోడ్డు సేఫ్టీ పద్ధతులు పాటించాలన్నారు. రహదారికి ఎడమ వైపున డ్రైవ్ చేయాలని, మద్యం సేవించి గాని, ట్రిపుల్ రైడ్ గాని చేయరాదన్నారు. మైనర్లకు వాహనాలు ఇవ్వరాదని, హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని ఆయన సూచించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించాలని ప్రతిజ్ఞ చేయించారు.

ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి కె.భవ్య, 1వ, 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జీలు ఎండీ.ఉమర్, ఎస్డీ జాకీయా సుల్తానా, సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ సీహెచ్ సత్యనారాయణ, బార్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు ఉయ్యాల నర్సయ్య, యడ్లపల్లి వెంకటేశ్వరరావు, కోడూరు వెంకటేశ్వరరావు, చలం,గట్ల నర్సింహారావు, ఎస్‌కే.రహీం, పాషా, బండి వీరభద్రరావు, ట్రాఫిక్ ఎస్ఐ అంజిరెడ్డి, హెడ్ కానిస్టేబుల్ గంట సత్యనారాయణ, కోర్టు, పోలీసు సిబ్బంది, మండల లీగల్ సర్వీస్ కమిటీ సిబ్బంది మౌనిక, ఫర్వీన్, శైలజ, వాలంటీర్లు మజార్, సైదమ్మ, విజయరావు, కోటయ్య పాల్గొన్నారు.

# దేశంలో తొలిసారి ఏపీలో విద్యుత్ చార్జీల తగ్గింపు

**–ప్రజా రంజకంగా కూటమి పాలన**
**–రూ.4498 కోట్ల ట్రూ అప్ చార్జీల భారాన్ని ప్రభుత్వమే భరిస్తోంది**
**–చారిత్రాతక నిర్ణయంతో యూనిటీ 13 పైసలు తగ్గాయి**
**–ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య**

జగ్గయ్యపేట జనవరి 5: విద్యుత్ చార్జీల తగ్గింపు దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. ఈ రోజు తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి ఆయన విలేకరులతో మాట్లాడుతూ రాష్ట్రం లో ప్రజారంజక పాలన కొనసాగుతున్నట్లు వివరించారు. విద్యుత్ చార్జీల భారం ప్రజలపై పడకుండా ఉండేందుకు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చర్యలు తీసుకున్నారని తెలిపారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి సూపర్ పాలన అందిస్తూ ప్రజల మన్ననలను పొందుతున్నట్లు పేర్కొన్నారు. ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని ఆర్థిక పరిస్థితి సరిగా లేకపోయినా ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నిటినీ నెరవేరుస్తున్నట్లు వివరించారు. ఇచ్చిన హామీలను అమలు చేస్తూ కొత్తగా ఇవ్వని హామీలు కూడా ప్రజలకు అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. 2019 లో ఆనాడు అధికారంలో ఉన్న తెలుగు దేశం ప్రభుత్వం మిగులు విద్యుత్ రాష్ట్రంగా ఉంచిందని, అనంతరం వచ్చిన ప్రభుత్వం ఐదు సంవత్సరాల పాలనలో 9సార్లు విద్యుత్ చార్జీలు పెంచి దాదాపు రూ.32 వేల కోట్లు భారాన్ని ప్రజలపై మోపినట్లు పేర్కొన్నారు. రాష్ట్ర విద్యుత్ వ్యవస్థను ప్రధాన ఆదాయం వనరుగా మార్చుకొని ఒకటి పాయింట్ 29 లక్షల కోట్లు అప్పులు మిగిల్చారని ఆరోపించారు.



కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వీరమైన విద్యుత్ వ్యవస్థను గాడిలో పెట్టేందుకు ఒక ప్రణాళిక ద్వారా సంస్కరణలు చేపట్టినట్లు వివరించారు.

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ ప్రకారం వేల కోట్ల విలువైన ట్రూ అప్ భారాన్ని ప్రభుత్వం భరించిందని పేర్కొన్నారు.

4498 కోట్ల చార్జీలు వసూలు చేయాలంటూ ఏపీ ఆర్‌సీ లేఖ రాసిన ఆ భారాన్ని ప్రభుత్వమే భరిస్తుందని చారిత్రాత్మకమైన నిర్ణయం తీసుకొని జరిగిందన్నారు.రాష్ట్రంలో సోలార్ పవర్ విద్యుత్ ప్లాంట్ లు ఏర్పాటుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తున్నట్లు తెలిపారు. కేంద్రం అందిస్తున్న సబ్సిడీపై అదనంగా 20 వేల రూపాయల అధిక సబ్సిడీని రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో నాయకులు గడ్డం హుస్సేన్, నెల్లూరు శ్రీనివాసరావు, చిత్తూరి రమేష్, మారేపల్లి సౌరి, ఆదిమల్ల వెంకన్న పాల్గొన్నారు

# ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రమాదాలను నివారించాలి.. సీఐ శ్రీధర్ రెడ్డి

నిజామాబాద్, జనవరి 5: ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ ప్రమాదాలను నివారించాలని ఆర్మూర్ రూరల్ సీఐ శ్రీధర్ రెడ్డి సూచించారు. నందిపేట్ మండల కేంద్రంలో సోమవారం జాతీయ రోడ్డు భద్రత మాసోత్సవాలలో భాగంగా పాఠశాల విద్యార్థులతో ప్రధాన రోడ్డుపై ర్యాలీ నిర్వహించారు. పాఠశాల ఆవరణలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు.

ద్విచక్ర వాహనంపై వెళ్లేవారు తప్పకుండా హెల్మెట్ ధరించాలని, సీట్ బెల్టు, డ్రైవింగ్ లైసెన్స్, ఓవర్ స్పీడ్ తదితర నిబంధనలను పాటించాలని సీఐ సూచించారు. ఈ కార్యక్రమంలో ఉజ్వల స్కూల్ కరస్పాండెంట్ గోజూరి అరుణ్, పోలీస్ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## భగవాన్ బుద్ధుడు ప్రసాదించిన జ్ఞానం, చూపిన మార్గం

# యావత్ మానవాళి సొంతం: పీఎం

న్యూ ఢిల్లీ, జనవరి 5:న్యూఢిల్లీలోని రాయ్ పిథోరా కల్చరల్ కాంప్లెక్స్‌లో ఇవాళ "ద లైట్ అండ్ ద లోటస్: రిలిక్స్ ఆఫ్ ద అవేకెన్డ్ వన్" పేరిట భగవాన్ బుద్ధునికి సంబంధించిన పవిత్రమైన పిప్రహ్వా అవశేషాల భారీ అంతర్జాతీయ ప్రదర్శనను ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధానమంత్రి మాట్లాడుతూ.. 125 ఏళ్ల తర్వాత భారత వారసత్వం తిరిగి వచ్చిందని, దేశ సంపద పునరాగమనం చేసిందన్నారు. నేటి నుంచి భారత ప్రజలు గౌతమ బుద్ధుడి పవిత్ర అవశేషాలను దర్శించుకుని, ఆయన ఆశీస్సులు పొందవచ్చని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఈ శుభ సందర్భంగా అతిథులకు స్వాగతం పలికిన శ్రీ నరేంద్ర మోదీ, శుభాకాంక్షలు తెలియజేశారు. బౌద్ధ సన్యాసులు, ధర్మ ఆచారయులు ఈ కార్యక్రమంలో పాల్గొనటం పట్ల సంతోషం వ్యక్తం చేస్తూ, ప్రణామాలు తెలియజేశారు. వారి ఉనికి కార్యక్రమానికి కొత్త శక్తినిచ్చిందని తెలిపారు. 2026 ప్రారంభంలోనే ఈ పవిత్ర వేడుక జరగటం స్ఫూర్తిదాయకమని ప్రధానమంత్రి అన్నారు. భగవాన్ బుద్ధుని ఆశీస్సులతో 2026వ సంవత్సరం ప్రపంచ వ్యాప్తంగా శాంతి, సంపద, సామరస్యంతో నవశకానికి నాంది పలకాలని ఆకాంక్షించారు.

ఈ ప్రదర్శన ఏర్పాటు చేసిన ప్రదేశం ఎంతో ప్రత్యేకమైనదని ప్రధానమంత్రి అన్నారు. భారతదేశ గొప్ప చరిత్రకు ఖిల్లా రాయ్ పిథోరా ప్రాంతం నిదర్శనమని, దాదాపు వెయ్యేళ్ల క్రితం పటిష్టమైన, సురక్షితమైన గోడలతో ఇక్కడి పాలకులు నగరాన్ని నిర్మించారని గుర్తు చేశారు. అదే చారిత్రక నగర ప్రాంగణానికి ఇవాళ ఆధ్యాత్మిక, పవిత్రమైన అధ్యాయాన్ని జోడించినట్లు అయిందని ఆయన అన్నారు. తాను ఇక్కడికి వచ్చే ముందుగానే ఈ చారిత్రక ప్రదర్శనను సమగ్రంగా వీక్షించినట్లు శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. భగవాన్ బుద్ధుని పవిత్ర అవశేషాలు మన మధ్య ఉండటం ఆశీర్వచనమని వ్యాఖ్యానించారు. ఈ అవశేషాలు భారత్ నుంచి వెళ్లటం, తిరిగి దేశానికి చేరుకోవటం మనకు ముఖ్యమైన పాఠాలను నేర్పుతాయన్నారు. బానిసత్వం కేవలం రాజకీయ, ఆర్థికపరమైన అంశం మాత్రమే కాదని, అది మన వారసత్వాన్ని నాశనం చేస్తుందని అన్నారు. భగవాన్ బుద్ధుని పవిత్ర అవశేషాల విషయంలోనూ ఇదే జరిగిందని, బానిస పాలనలో దేశం దాటిపోయిన అవశేషాలు.. దాదాపు 125 ఏళ్లపాటు దేశానికి దూరంగా ఉన్నాయని శ్రీ నరేంద్ర మోదీ తెలిపారు. వీటిని తీసుకెళ్లిన వారికి, వారి వారసులకు ఈ అవశేషాలు కేవలం ప్రాణం లేని పురాతన వస్తువులు మాత్రమేనని.. అందుకే వాటిని అంతర్జాతీయ మార్కెట్లో వేలం వేయటానికి ప్రయత్నించారని చెప్పారు. భారత్‌కు మాత్రం ఈ అవశేషాలు ఆరాధ్య దైవమని, నాగరికతలో అంతర్భాగమని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ వీటి బహిరంగ వేలానికి భారత్ అనుమతించదని వెల్లడించారు. ఈ విషయంలో సహకరించిన గోద్రెజ్ గ్రూపు సంస్థకు శ్రీ నరేంద్ర మోదీ కృతజ్ఞతలు తెలిపారు. వారి సహకారంతోనే భగవాన్ బుద్ధుని పవిత్ర అవశేషాలను కర్మభూమికి, ఆయన తపోభూమికి, మహాబోధి భూమికి, మహాపరినిర్వాణ భూమికి తిరిగి తీసుకురాగలిగినట్లు తెలిపారు.

"భగవాన్ బుద్ధుడు ప్రసాదించిన జ్ఞానం, చూపిన మార్గం యావత్ మానవాళి సొంతం" అని, కొన్ని నెలలుగా ఈ భావన అనుభవపూర్వకంగా నిరూపి తమవుతోందని ప్రధానమంత్రి తెలిపారు. ఇటీవల కాలంలో భగవాన్ బుద్ధుని పవిత్ర అవశేషాలు వెళ్లిన చోటల్లా భక్తిశ్రద్ధలు వెల్లువెత్తాయని గుర్తుచేశారు. థాయ్‌లాండ్‌లోని పలు ప్రాంతాల్లో ఈ పవిత్ర అవశేషాలను ఉంచినపుడు, కేవలం నెల రోజుల్లోనే దాదాపు 40 లక్షల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారని శ్రీ నరేంద్ర మోదీ చెప్పారు. వియత్నాంలో ప్రదర్శన సమాయాన్ని పొడిగించాల్సి వచ్చిందని వెల్లడించారు. అక్కడ తొమ్మిది నగరాల్లో సుమారు 1.75 కోట్ల మంది ప్రజలు ఆ పవిత్ర అవశేషాలకు నివాళులర్పించారని తెలిపారు. మంగోలియాలో వేలాది మంది ప్రజలు గండన్ మొనాస్టరీ బయట గంటల తరబడి వేచి ఉన్నారని, బుద్ధుడు పుట్టిన గడ్డ భారత్ నుంచి వచ్చిన ప్రతినిధులను తాకేందుకు కూడా ఎంతో మంది ఆరాటపడ్డారని మోదీ తెలిపారు. రష్యాలోని కల్మికియాలో కేవలం ఒక వారంలో 1.5 లక్షల మందికి పైగా భక్తులు పవిత్ర అవశేషాలను దర్శించుకున్నారని, ఈ సంఖ్య అక్కడి స్థానిక జనాభాలో సగానికి పైగా ఉంటుందని చెప్పారు. వివిధ దేశాల్లో జరిగిన కార్యక్రమాల్లో సామాన్య పౌరుడి నుంచి ప్రభుత్వాధినేతల వరకు అందరూ భక్తిభావంతో ఏకమయ్యారని, భగవాన్ బుద్ధుడు అందరివాడని, అందరినీ ఏకం చేస్తాడని శ్రీ నరేంద్ర మోదీ వ్యాఖ్యానించారు.

భగవాన్ బుద్ధుడి ప్రభావం తన జీవితంపై ఎంతో ఉందని, అందుకు ఎంతో అదృష్టవంతుడిని అని ప్రధానమంత్రి అన్నారు. ఆయన జన్మస్థలమైన వడోదరా ఒకప్పుడు బౌద్ధ విద్యా కేంద్రంగా విరాజిల్లిందని, బుద్ధుడు మొదటగా బోధనలు చేసిన సారనాథ్ కర్మభూమి అని గుర్తుచేసుకున్నారు. ప్రభుత్వ బాధ్యతల్లో లేని సమయంలోనూ యాత్రికుడిలా అనేక బౌద్ధ క్షేత్రాలను సందర్శించినట్లు చెప్పారు. ప్రధానమంత్రిగా, ప్రపంచవ్యాప్తంగా ఉన్న ఎన్నో బౌద్ధ క్షేత్రాలను దర్శించుకునే భాగ్యం కలిగిందని తెలిపారు. నేపాల్‌లోని లుంబినీ వద్ద మాయాదేవి ఆలయంలో ప్రణమిల్లటం అద్భుతమైన అనుభూతిని ఇచ్చిందన్నారు. జపాన్‌లోని తో-జి, కింకాకు-జి ఆలయాలను సందర్శించినప్పుడు బుద్ధుని సందేశం కాలానికి అతీతమైనదని అనిపించిందని శ్రీ నరేంద్ర మోదీ గుర్తుచేసుకున్నారు. చైనాలోని క్సియాన్‌లోని జైంట్ వైల్డ్ గూస్ పగోడాను సందర్శించిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అక్కడి నుంచే బౌద్ధ గ్రంథాలు ఆసియా వ్యాప్తంగా విస్తరించాయని, ఆ విషయంలో భారత్ పాత్రను ఇప్పటికీ గుర్తుంచుకుంటారని పేర్కొన్నారు. మంగోలియాలోని గాండన్ మఠాన్ని సందర్శించినప్పుడు, బుద్ధుని వారసత్వంతో అక్కడి ప్రజలకు విడదీయరాని భావోద్వేగ బంధాన్ని చూసినట్లు చెప్పారు. శ్రీలంకలోని అనురాధపురలో జయశ్రీ మహాబోధిని దర్శించుకోవటం, చక్రవర్తి అశోకుడు, భిక్కు మహిందుడు, సంఘమిత్రలు నాటిన సంప్రదాయంతో మమేకమయ్యే అనుభూతిని ఇచ్చిందని తెలిపారు. థాయ్‌లాండ్‌లోని వాట్ ఫో, సింగపూర్‌లోని బుద్ధ టూత్ రెలిక్ టెంపుల్ సందర్శనలు భగవాన్ బుద్ధుని బోధనల ప్రభావంపై అవగాహనను మరింత పటిష్టం చేశాయని ప్రధానమంత్రి చెప్పారు.

తాను ప్రపంచంలోని ఎక్కడికి వెళ్లినా, భగవాన్ బుద్ధుడి వారసత్వానికి చెందిన ఒక ప్రతీకను తప్పకుండా భారత్‌కు తీసుకురావడానికి ప్రయత్నించానని ప్రధానమంత్రి వ్యాఖ్యానించారు. చైనా, జపాన్, కొరియా, మంగోలియా దేశాల నుంచి బోధి వృక్షం మొక్కలను తీసుకువచ్చిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. అణుబాంబు దాడితో పూర్తిగా విధ్వంసమైన హిరోషిమా నగరంలోని వృక్ష ఉద్యానవనంలో ఒక బోధివృక్షం నిలిచినప్పుడు, అది మానవాళికి ఇచ్చే లోతైన సందేశాన్ని మనం ఊహించవచ్చని తెలిపారు.

బుద్ధుడికి సంబంధించిన ఈ సాంప్రదాయ వారసత్వం ద్వారా భారత్ ప్రపంచంతో కేవలం రాజకీయాలు, దౌత్యం, ఆర్థిక వ్యవస్థల ద్వారానే కాకుండా మరింత లోతైన బంధాలతో అనుసంధానమై ఉందని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. భారత్ మనస్సులతో, భావోద్వేగాలతో, విశ్వాసం, ఆధ్యాత్మికతతో ప్రపంచంతో అనుసంధానమై ఉందని అన్నారు. భారత్ కేవలం బుద్ధుడి పవిత్ర అవశేషాల సంరక్షక దేశం మాత్రమే కాదు.. ఆయన సంప్రదాయాన్ని సజీవంగా కొనసాగిస్తున్న దేశం కూడా అని ఆయన అన్నారు. పిప్రహ్వా, వైశాలి, దేవ్నీ మోరి, నాగార్జునకొండల్లో లభించిన బుద్ధుడి అవశేషాలు ఆయన సందేశానికి సజీవ సాక్ష్యాలని ప్రధాని పేర్కొన్నారు. శాస్త్రం, ఆధ్యాత్మికత ద్వారా భారత్ ఈ అవశేషాలను ప్రతి రూపంలో సంరక్షించి, కాపాడుతూ వచ్చిందని స్పష్టం చేశారు.

ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధ వారసత్వ ప్రదేశాల అభివృద్ధికి భారత్ నిరంతరం కృషి చేస్తోందని ప్రధానమంత్రి తెలిపారు. నేపాల్‌లో సంభవించిన వినాశకరమైన భూకంపం వల్ల పురాతన బౌద్ధ స్థూపం దెబ్బతిన్నప్పుడు, దాని పునర్నిర్మాణానికి భారత్ పూర్తి మద్దతు అందించిందని గుర్తు చేశారు. మయన్మార్‌లోని బాగన్ ప్రాంతంలో భూకంపం తర్వాత అక్కడి 11 కంటే ఎక్కువ పగోడాల పరిరక్షణ బాధ్యతను భారత్ చేపట్టిందని ఆయన చెప్పారు. ఇలాంటి ఉదాహరణలు చాలా ఉన్నాయని అన్నారు. భారత్‌లో కూడా బౌద్ధ సంప్రదాయానికి సంబంధించిన ప్రదేశాలు, అవశేషాల అన్వేషణ, సంరక్షణ నిరంతరం కొనసాగుతోందని ఆయన పేర్కొన్నారు. తన జన్మస్థలమైన వాద్‌నగర్ ఒకప్పుడు బౌద్ధ సంప్రదాయానికి ప్రధాన కేంద్రంగా ఉండేదని ప్రధాని తెలిపారు. తాను ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో అక్కడ వేలాది బౌద్ధ అవశేషాలు బయటపడ్డాయని చెప్పారు. ప్రస్తుత ప్రభుత్వం వాటిని సంరక్షించడమే కాకుండా, నేటి తరానికి ఆ చరిత్రను పరిచయం చేస్తోందని పేర్కొన్నారు. అక్కడ దాదాపు 2500 ఏళ్ల చరిత్రను కళ్లకు కట్టేలా ఒక అద్భుతమైన అనుభవ మ్యూజియాన్ని నిర్మించినట్లు తెలిపారు. కొన్ని నెలల క్రితమే జమ్మూ కాశ్మీర్‌లోని బారాములాలో బౌద్ధ యుగానికి చెందిన ఒక ప్రధాన ప్రదేశం కనుగొన్నట్లు చెప్పారు. దాని పరిరక్షణ పనులు ప్రస్తుతం వేగంగా జరుగుతున్నాయని ఆయన వెల్లడించారు.

గడిచిన పది పదకొండు ఏళ్లలో భారత్ బౌద్ధ క్షేత్రాలను ఆధునికతతో అనుసంధానించడానికి చేసిన కృషిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వివరించారు. బోధ్ గయలో ఒక కన్వెన్షన్ సెంటర్, ధ్యానం, అనుభవ కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సారనాథ్‌లోని ధమేక్ స్థూపం వద్ద లైట్ అండ్ సౌండ్ షో, బుద్ధ థీమ్ పార్కును అభివృద్ధి చేశారని, శ్రావస్తి, కపిలవస్తు, కుశీనగర్ ప్రాంతాల్లో పర్యాటకుల కోసం ఆధునిక వసతులను కల్పించినట్లు చెప్పారు. తెలంగాణలోని నల్గొండలో డిజిటల్ అనుభవ కేంద్రాన్ని ఏర్పాటు చేయడంతో పాటు... సాంచి, నాగార్జున సాగర్, అమరావతిలలో యాత్రికుల కోసం కొత్త సౌకర్యాలను అభివృద్ధి చేసినట్లు ఆయన తెలిపారు. దేశంలోని అన్ని బౌద్ధ యాత్రా స్థలాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యాలను కల్పించేందుకు బౌద్ధ సర్క్యూట్‌ను రూపొందిస్తున్నట్లు ప్రధానమంత్రి వెల్లడించారు. దీని వల్ల ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు అద్భుతమైన ఆధ్యాత్మిక అనుభూతిని పొందుతారని ఆయన అన్నారు.

"బౌద్ధ వారసత్వాన్ని సహజసిద్ధమైన రీతిలో భవిష్యత్తు తరాలకు అందించడమే దేశ లక్ష్యం" అని ప్రధానమంత్రి స్పష్టం చేశారు. ప్రపంచ బౌద్ధ సమావేశం, వైశాఖ, ఆషాఢ పౌర్ణమి వంటి అంతర్జాతీయ కార్యక్రమాలను కూడా ఈ ఆలోచనతోనే నిర్వహిస్తున్నామని ఆయన వివరించారు. భగవాన్ బుద్ధుని బోధనలు, అభిధమ్మ అసలు రూపం పాళీ భాషలో ఉన్నాయని గుర్తు చేస్తూ, సాధారణ ప్రజలకు ఈ భాషను చేరువ చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని చెప్పారు. అందుకే పాళీ భాషకు ప్రాచీన భాష హోదా కల్పించామని, ఇది బుద్ధుని ధర్మాన్ని దాని అసలు సారాంశంతో అర్థం చేసుకోవడానికి ఎంతో దోహదపడుతుందని మోదీ తెలిపారు. బౌద్ధ సంప్రదాయానికి అనుసంధానించిన పరిశోధనలను కూడా బలోపేతం చేస్తుందని ఆయన పేర్కొన్నారు.

బుద్ధ భగవానుడి పవిత్ర అవశేషాలు భారతదేశ వారసత్వ సంపదని, దాదాపు శతాబ్ద కాలం నిరీక్షణ తర్వాత ఇవి తిరిగి స్వదేశానికి చేరుకున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఉన్న ప్రజలందరూ వచ్చి ఈ పవిత్ర అవశేషాలను దర్శించుకోవాలని, బుద్ధుని ఉన్నతమైన ఆలోచనలతో మమేకం కావాలని కోరారు. జీవితంలో ఒక్కసారైనా ఈ ప్రదేశాన్ని సందర్శించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. పాఠశాల విద్యార్థులు, కళాశాల విద్యార్థులు, యువతీ యువకులు తప్పకుండా ఈ ప్రదర్శనను చూడాలని కోరారు. మన గత వైభవాన్ని భవిష్యత్తు కలలతో అనుసంధానించడానికి ఈ ప్రదర్శన ఒక అద్భుతమైన మాధ్యమమని ప్రధాని చెప్పారు. దేశవ్యాప్తంగా ప్రజలు ఈ ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని కోరుతూ, ఈ కార్యక్రమం దిగ్విజయంగా సాగాలని అందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రులు శ్రీ గజేంద్ర సింగ్ షెకావత్, శ్రీ కిరణ్ రిజిజు, శ్రీ రామ్ దాస్ అథవాలే, శ్రీ రావు ఇంద్రజిత్ సింగ్, ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ శ్రీ వినయ్ సక్సేనాతో పాటు ఇతర ప్రముఖులు పాల్గొన్నారు.

శతాబ్ద కాలం తర్వాత స్వదేశానికి తిరిగి వచ్చిన పిప్రహ్వా అవశేషాలను, ప్రస్తుతం న్యూఢిల్లీలోని జాతీయ మ్యూజియం, కోల్‌కతాలోని ఇండియన్ మ్యూజియాల్లో భద్రపరచిన పిప్రహ్వా పురావస్తు సంపదతో కలిపి తొలిసారి ఒకేచోట ప్రజల కోసం ప్రదర్శిస్తున్నారు.

1898లో కనుగొన్న పిప్రహ్వా అవశేషాలు ప్రారంభ బౌద్ధమత పురావస్తు అధ్యయనంలో అత్యంత కీలక స్థానాన్ని కలిగి ఉన్నాయి. ఇవి భగవాన్ బుద్ధునికి నేరుగా సంబంధం ఉన్న అత్యంత ప్రాచీన, చారిత్రకంగా ముఖ్యమైన అవశేషాలలో ఒకటిగా గుర్తింపు పొందాయి. పురావస్తు ఆధారాలు పిప్రహ్వా ప్రదేశాన్ని ప్రాచీన కపిలవస్తు నగరంతో అనుసంధానిస్తున్నాయి. కపిలవస్తు అనేది సన్యాసం స్వీకరించే ముందు భగవాన్ బుద్ధ తన ప్రారంభ జీవితం గడిపిన ప్రాంతంగా గుర్తింపు పొందింది.

ఈ ప్రదర్శన భగవాన్ బుద్ధుని బోధనలతో భారత్‌కు ఉన్న లోతైన, నాగరిక సంబంధాన్ని తెలియజేస్తుంది. దేశ గొప్ప ఆధ్యాత్మిక, సాంస్కృతిక వారసత్వాన్ని పరిరక్షించాలనే ప్రధానమంత్రి నిబద్ధతను ప్రతిబింబిస్తుంది. ప్రభుత్వం నిరంతర కృషి, సంస్థాగత సహకారం, వినూత్న ప్రభుత్వ, ప్రైవేటు భాగస్వామ్యం ద్వారా ఈ అవశేషాలను ఇటీవల తిరిగి స్వదేశానికి తీసుకురావడం సాధ్యమైంది.

ఈ ప్రదర్శనను వివిధ ఇతివృత్తాల ఆధారంగా ఏర్పాటు చేశారు. సాంచి స్థూపం నుంచి స్ఫూర్తి పొందిన పునర్నిర్మిత వ్యాఖ్యానాత్మక నమూనా దీనికి ప్రధాన ఆకర్షణ. ఇందులో జాతీయ సేకరణల నుంచి తీసుకొచ్చిన అసలైన అవశేషాలు, అరుదైన వస్తువులను ఒకచోట ప్రదర్శించనున్నారు. ఇతర విభాగాల్లో పిప్రహ్వా పురావస్తు విశేషాల పునశ్చరణ, బుద్ధుని జీవితంలోని ముఖ్య ఘట్టాలు, దృశ్యాదృశ్యాలు: బౌద్ధ బోధనల సౌందర్య భాష, సరిహద్దులు దాటి విస్తరించిన బౌద్ధ కళలు, ఆదర్శాలు, సాంస్కృతిక కళాఖండాల స్వదేశ పునరాగమనం: నిరంతర ప్రయత్నం వంటివి ఉన్నాయి.

సాధారణ ప్రజలకు ఈ అవశేషాల ప్రాముఖ్యత సులభంగా అర్థం కావడానికి అత్యాధునిక సాంకేతికతను ఉపయోగిస్తున్నారు. ఇందులో లీనమయ్యే చిత్రాలు, డిజిటల్ పునర్నిర్మాణాలు, మల్టీమీడియా ప్రదర్శనలు ఉన్నాయి. ఈ అంశాలు భగవాన్ బుద్ధుని జీవితం, పిప్రహ్వా అవశేషాల ఆవిష్కరణ, అవి ప్రాంతాల మధ్య ప్రయాణించిన విధానం, వాటికి సంబంధించిన కళా సంప్రదాయాలపై సులభంగా అర్థమయ్యేలా అవగాహనను అందిస్తాయి.

## భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం

**-పల్లంపల్లిలో పట్టాదారు పాసు పుస్తకాల పంపిణీ**
**-45 మంది రైతులకు అందజేసిన ఎమ్మెల్యే సౌమ్య**

అమరావతి, జనవరి 5: వీరులపాడు మండలం పల్లంపల్లి గ్రామంలో ఈరోజు ఎన్డీఏ కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మీ భూమి మీ హక్కు కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, పల్లంపల్లి రెవెన్యూ పరిధిలోని 45 మంది రైతులకు ప్రభుత్వ రాజముద్రతో కూడిన పట్టాదారు పాసు పుస్తకాలను అధికారులు, కూటమి నేతలతో కలిసి లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, భూమిపై రైతులకు సంపూర్ణ హక్కులు కల్పించాలనే ఉద్దేశంతో ఎన్డీఏ కూటమి ప్రభుత్వం "మీ భూమి మీ హక్కు కార్యక్రమాన్ని అమలు చేస్తోందని తెలిపారు.

భూ సంబంధిత వివాదాలకు శాశ్వత పరిష్కారం అందించడంతో పాటు, రైతులు ఆర్థికంగా బలోపేతం కావడానికి ఈ పట్టాదారు పాసు పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. ప్రభుత్వ రాజముద్రతో జారీ చేసిన పాసు పుస్తకాల వల్ల రైతులకు బ్యాంకు రుణాలు, వ్యవసాయ పెట్టుబడులు సులభంగా లభిస్తాయని, రైతు సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. రైతుల హక్కులను కాపాడేందుకు ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు, స్థానిక కూటమి నాయకులు, గ్రామ పెద్దలు, రైతులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత

**-గౌరవరం గ్రామంలో 61 లక్షల అభివృద్ధి పనులు**
**-పల్లె పండుగ 2.0 ద్వారా గ్రామ సీమల అభివృద్ధి**
**-ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య**
**-జిల్లా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాం**

అమరావతి, జనవరి 5:గ్రామాల అభివృద్ధికి కూటమి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, జిల్లా



కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాంలు అన్నారు. జగ్గయ్యపేట మండలం గౌరవరం గ్రామంలో రూ.61 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, జిల్లా కేడీసీసీ బ్యాంకు చైర్మన్ నెట్టెం రఘురాంలు ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.

ఈసందర్భంగా గ్రామంలో 16 లక్షల రూపాయల నిధులతో నిర్మించిన గోకులం షెడ్ లను, 30 లక్షల రూపాయలతో నిర్మించిన సీసీ రోడ్లను ఎమ్మెల్యే తాతయ్య, కేడీసీసీ బ్యాంక్ చైర్మన్ నెట్టెం రఘురాంలు ప్రారంభించారు. రూ.15 లక్షల నిధులతో నూతనంగా నిర్మించనున్న సిమెంట్ రోడ్లకు భూమిపూజ చేశారు.

అనంతరం ఎమ్మెల్యే తాతయ్య, నెట్టెం రఘురాం లు మాట్లాడుతూ గౌరవరం గ్రామంలో రూ.61 లక్షల నిధులతో వివిధ అభివృద్ధి పనులు చేసుకోవడం జరిగిందన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుండి రాష్ట్రంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలలో మౌలిక సదుపాయాల కల్పనలకు ప్రత్యేక ప్రణాళిక ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ముందుకు వెళుతున్నట్లు వివరించారు. గ్రామాల అభివృద్ధికి రాష్ట్రం లో పల్లె పండుగ 2.0 వంటి కార్యక్రమాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. బస్సు పోషణకు ప్రోత్సహించేందుకు గోకులం షెడ్లను నిర్మాణం రైతులకు అవసరమైన సదుపాయాలు సహకారం ప్రభుత్వం తెలిపారు. పేద ప్రజలకు మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి పథకం ద్వారా ఆదాయ మార్గాలు కల్పిస్తున్నట్లు తెలిపారు.

మహిళల ఆర్థిక స్వలంబన సాధించేందుకు స్వయం సహాయక సంఘాలను బలోపేతం చేస్తూ వారికి రుణాలు, ఉపాధి అవకాశాలు కల్పిస్తున్నట్లు పేర్కొన్నారు. వైద్య, విద్యా రంగాల్లో గణనీయమైన మార్పులు ప్రభుత్వం తీసుకువచ్చినట్లు తెలిపారు. గ్రామాలను కూడా అభివృద్ధిలో ముందుంచే విధంగా ప్రభుత్వం ముందుకు వెళుతున్నట్లు వివరించారు.

ఈకార్యక్రమంలో ఎంపీడీవో జి.నితిన్, జగ్గయ్యపేట మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గౌరవరం సొసైటీ చైర్మన్ కట్ట వెంకట నరసింహారావు, గ్రామ సర్పంచ్ ముత్తవరపు పావని వెంకటేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ మల్లెల సీతమ్మ, ఏపీవో రామకృష్ణ, శేషగిరి, మహేష్, బుచ్చిబాబు, సయ్యద్ జాన్ బాషా, కొప్పుల నాగేశ్వరరావు, కుక్కల జగదీష్, కొప్పుల రాము, బాజినీడి ధన మూర్తి, కోట వీర రాఘవయ్య, కొమ్మినేని వెంకటరావు, పఠాన్ మహమ్మద్ ఖాన్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# 7న సిద్ధార్థ స్వర్ణోత్సవాలు..

**-వేడుకలకు హాజరుకానున్న సీఎం చంద్రబాబు..**

విజయవాడ, జనవరి 5: ఈనెల 7న సాయంత్రం విజయవాడ మొఘల్రాజపురంలోని పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జరిగే సిద్ధార్థ అకాడమి ఆఫ్ జనరల్ అండ్ టెక్నికల్ ఎడ్యుకేషన్ స్వర్ణోత్సవాల్లో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటారని, కేంద్ర మంత్రి కె.రామ్మోహననాయుడు విశిష్ట అతిథిగా విచ్చేస్తారని సిద్ధార్థ అకాడమి అధ్యక్షుడు మలినేని రాజయ్య, కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, సంయుక్త కార్యదర్శి, పి.బి. సిద్ధార్థ కళాశాల కన్వీనర్ నిమ్మగడ్డ లలితప్రసాద్ తెలిపారు.

ఇవాళ కళాశాలలోని వెబినార్ హాలులో వారు విలేకరులతో మాట్లాడుతూ 1975లో 250 మంది వదాన్యులైన ప్రముఖులు అందరికీ విద్యను అందుబాటులోకి తెచ్చేందుకు విజయవాడలో నెలకొల్పిన సిద్ధార్థ అకాడమి, పి.బి. సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల, ఉయ్యూరులో ఏజీ అండ్ ఎస్.జి. సిద్ధార్థ ఆర్ట్స్



అండ్ సైన్స్ కళాశాలలు 18 విద్యాసంస్థలుగా ఎదిగాయన్నారు. సిద్ధార్థ విద్యాసంస్థల అభివృద్ధికి ఎంతో కృషిచేసిన 8 మంది ప్రధాన దాతలను ఆరోజున కళాశాల మైదానంలో జరిగే కార్యక్రమంలో సత్కరిస్తామని చెప్పారు. సిద్ధార్థ స్వర్ణోత్సవాలను గత ఏడాది మార్చి 7న అప్పటి యూజీసీ ఛైర్మన్ ప్రారంభించారని చెప్పారు. స్వర్ణోత్సవాల్లో భాగంగా గత పది నెలలుగా సిద్ధార్థ విద్యాసంస్థలలో పలు సదస్సులు, సమావేశాలు, పోటీలు, సినీ సంగీత విభావరి, వైద్య, విజ్ఞానశాస్త్ర ప్రదర్శనలు, ఆర్బీఐ పూర్వ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు తదితరులతో అతిథి ఉపన్యాసాలు తదితర ప్రత్యేక కార్యక్రమాలు ఏర్పాటు చేశామన్నారు.

ఎప్పటికప్పుడు ఉపాధికి దోహదపడే కొత్తకోర్సులు ప్రవేశపెడుతూ ఉన్నత విద్యకు అకాడమీ ఊతమిస్తోందన్నారు. ఈ ఐదు పదుల సుదీర్ఘ ప్రస్థానంలో విజయవాడను విద్యాకేంద్రంగా సిద్ధార్థ అకాడమీ మలచిందన్నారు. విజయవాడను సాంస్కృతిక రాజధానిగా అభివృద్ధి చేయడంలో సిద్ధార్థ అకాడమి కీలక భూమిక పోషించిందని, అనుబంధ విభాగంగా సిద్ధార్థ కళాపీఠం ఏర్పాటుచేసి దేశం నలుమూలల నుంచి సుప్రసిద్ధ కళాకారులను విజయవాడకు ఆహ్వానించి ఎన్నో శాస్త్రీయ సంగీత, నృత్య కార్యక్రమాలను ఏర్పాటు చేసిందన్నారు. ఈ సమావేశంలో ఉపాధ్యక్షులు వెల్లంకి నాగభూషణం, జాయింట్ సెక్రటరీ సూరెడ్డి విష్ణు కూడా పాల్గొన్నారు.


## మైనర్ ఇరిగేషన్ సెన్సెస్ పై శిక్షణ

ఆసిఫాబాద్, జనవరి 5:కొమరం భీమ్ ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు) మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో ఏడవ మైనర్ ఇరిగేషన్ సెన్సెస్ పై ఇవాళ జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్ మండలాలకు చెందిన డిప్యూటీ స్టాటిస్టికల్ ఆఫీసర్లు, అసిస్టెంట్ ఆఫీసర్లకు ఈజీఎస్ ఉద్యోగులు పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో ఎస్‌ఓ వెంకటేశ్వర్ మైనర్ ఇరిగేషన్ సెన్సెస్ పై సెన్సెస్ నిర్వాహణ విధానం, డేటా సేకరణ, నివేదికల తయారీ పై అవగాహన కల్పించారు. ఎంపీడీవో కృష్ణారావు మాట్లాడుతూ మైనర్ ఇరిగేషన్ సెన్సెస్ ను సద్వినియోగం చేసుకొని పారదర్శకంగా నిర్వహించాలని ఆయన కోరారు. ఈ శిక్షణ కార్యక్రమంలో మూడు మండలాల అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ శ్రేణులు ధైర్యంగా ఉండండి

**-జుక్కల్ మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే**
**-బిఆర్ఎస్ లో చేరిన బిజెపి,కాంగ్రెస్ నాయకులు**

కామారెడ్డి, జనవరి 5:జుక్కల్ మండలంలోని ఖండేబల్లూర్ గ్రామంలో బీఆర్ఎస్



యువ నాయకురాలు స్వప్న శ్రీనివాస్ ఆధ్వర్యంలో బీజేపీ, కాంగ్రెస్ నుండి పలువురు నాయకులు బీఆర్ఎస్ లో చేరడం జరిగింది. ఈసందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే హన్మంత్ షిండే ఇరుపార్టీల నుండి బీఆర్ఎస్ లో చేరిన వారికి బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే షిండే మాట్లాడుతూ.. మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని, పింఛన్ల పెంపు, కళ్యాణ లక్ష్మి, షాదీముబారక్ లో తులంబంగారం ఏమైందన్నారు. ప్రతి ఇంటికి 2500రూపాయలు పంపిణీ, నిరుద్యోగ భృతి రకరకాల హామీలను గాలికి వదిలేయడం జరిగిందన్నారు. పార్టీలో చేరిన వారిలో బీజేపీ నుండి నాగల్‌గాం మాజీ సర్పంచ్ కపిల్ పటేల్ తోపాటు బీజేపీ, కాంగ్రెస్‌కు చెందిన పదుల సంఖ్యలో నాయకులు ఉన్నారు. ఈకార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బొల్లి గంగాధర్, లాడేగాం సర్పంచ్ రాజశేఖర్ పటేల్, డోన్‌గాం సర్పంచ్ శ్రీనివాస్, బీఆర్ఎస్ యువ నాయకులు వాస్రె రమేష్, బీఆర్ఎస్ నాయకులు మోయిన్, శివరాజ్ దేశాయ్, హన్మరెడ్డి, సదశివ్ పటేల్, శివాజీ పటేల్ తదితరులు ఉన్నారు.

# తెలంగాణలో స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ ఫామ్ అండ్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్, అత్యాధునిక రీ-సర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్ కేంద్రాలను ప్రారంభించనున్న కేంద్ర మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్

న్యూ ఢిల్లీ, జనవరి 5:తెలంగాణలోని హైదరాబాద్‌లో ఈ నెల 5న జరిగే సాధారణ కార్యవర్గ సమావేశం అనంతరం కేంద్ర మత్స్య, పశుసంవర్ధక, పాడిపరిశ్రమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి శ్రీ రాజీవ్ రంజన్ సింగ్ అలియాస్ లాలన్ సింగ్ స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ ఫామ్- రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, అత్యాధునిక రీసర్క్యులేటరీ ఆక్వాకల్చర్ సిస్టమ్ కేంద్రాలను ప్రారంభిస్తారు.

స్మార్ట్ గ్రీన్ ఆక్వాకల్చర్ లిమిటెడ్ దేశంలోనే మొదటి వాణిజ్య-స్థాయి ఉష్ణమండల రీసర్క్యులేటింగ్ ఆక్వాకల్చర్ సిస్టమ్ ఆధారిత రెయిన్‌బో ట్రౌట్ ఆక్వాకల్చర్ ఫామ్ అండ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌ను ఏర్పాటు చేసింది. ఇది భారత ఆక్వాకల్చర్ పరివర్తనలో కీలక ముందడుగును సూచిస్తుంది. తెలంగాణలోని రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలంలో రెయిన్‌బో ట్రౌట్ వంటి అధిక-విలువైన చల్లని నీటి చేప జాతులను ఉష్ణమండల వాతావరణంలో ఏడాది పొడవునా, కచ్చితమైన ఇంజనీరింగ్, నియంత్రిత జీవ వ్యవస్థలు, అధునాతన నీటి పునర్వినియోగ సాంకేతికతలను ఉపయోగించి సాగు చేయవచ్చని ఇది నిరూపిస్తుంది. ప్రీమియం ఆక్వాకల్చర్ జాతులు భౌగోళికంగా నిర్దిష్ట వాతావరణ మండలాలకు పరిమితమనే దీర్ఘకాలిక అంచనాలను ఈ విజయం తారుమారు చేస్తుంది. ఇది ఆక్వాకల్చర్ సాగులో వాతావరణం కంటే సాంకేతికతే కీలకమని నిరూపిస్తుంది.

ఈ ప్రాజెక్ట్ ప్రత్యక్ష శిక్షణ, ప్రదర్శనల వేదికగా పనిచేస్తుంది. అధునాతన ఆక్వాకల్చర్ వ్యవస్థలు, ఆటోమేషన్, బయోసె క్యూరిటీలలో యువతకు ఆచరణాత్మక అనుభవాన్ని అందిస్తుంది. మత్స్య రంగంలో ఉత్పాదకతను పెంచడం కోసం రైతులకు మంచి అవగాహనను, విజ్ఞానాన్ని అందిస్తుంది.

దేశంలో మత్స్య, ఆక్వాకల్చర్ రంగాల సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా భారత ప్రభుత్వం అనేక పరివర్తనాత్మక కార్యక్రమాలను ప్రారంభించింది. గత కొన్ని సంవత్సరాల్లో ప్రత్యేకించి ఈ రంగం కోసం కేంద్ర ప్రభుత్వ పెట్టుబడుల్లో గణనీయమైన పెరుగుదల నమోదైంది. 2015లో ఈ ప్రయత్నం ప్రారంభించినప్పటి నుంచి వివిధ పథకాల ద్వారా మొత్తం రూ. 38,572 కోట్ల విలువైన పెట్టుబడులను ఆమోదించారు...లేదా ప్రకటించారు.

విస్తృత మత్స్య రంగంలో చల్లని నీటి మత్స్య పరిశ్రమ వేగంగానూ, అధిక-సంభావ్యత కలిగిన విభాగంగా అభివృద్ధి చెందుతోంది. ఖరీదైన చల్లని నీటి చేప జాతులకు పెరుగుతున్న మార్కెట్ డిమాండ్‌తో పాటు దేశీయ, ఎగుమతి అవకాశాలను విస్తరించడం, సుస్థిర ఆక్వాకల్చర్ సాంకేతికతల్లో పెట్టుబడులను పెంచడం ద్వారా ఈ ఉప విభాగం పర్వతాలు, ఎత్తయిన ప్రాంతాల ప్రజల జీవనోపాధికి, ఆర్థిక వృద్ధి కి కీలక సహకారిగా అభివృద్ధి చెందుతోంది.ట్రౌట్ చేపల సాగు భారత ఆక్వాకల్చర్ రంగంలో అధిక- విలువైన, వ్యూహాత్మకంగా ముఖ్యమైన విభాగాన్ని సూచిస్తుంది. ఇది ఎక్కువగా హిమాలయాలు, కొండ ప్రాంత రాష్ట్రాలైన ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్, జమ్మూ కాశ్మీర్, అరుణాచల్ ప్రదేశ్, సిక్కింలలో కేంద్రీకృతమై ఉంది. ఇది మంచుతో నిండిన వాగులు, నదుల నుంచి చల్లని, ఆక్సిజన్ సంతృప్తంగా ఉన్న నీటి వనరుల్లో పెరుగుతుంది.రెయిన్‌బో ట్రౌట్ హేచరీల అభివృద్ధి ద్వారా ఈ వనరులను సద్వినియోగం చేసుకోవడంలో మత్స్య శాఖ గణనీయ పురోగతిని సాధించింది. ఇవి చేపల ఉత్పత్తిని గణనీయంగా పెంచాయి. స్థానికంగా ఉపాధి అవకాశాలనూ సృష్టించాయి. కొత్త హేచరీల ఏర్పాటు, అధునాతన ఆక్వాకల్చర్ పద్ధతులను అవలంబించడంతో సంవత్సరానికి 14 లక్షల ట్రౌట్ చేప విత్తనాల ఉత్పత్తి సాధ్యమైంది. ట్రౌట్ చేపలను అందించడానికి వైబ్రంట్ విలేజ్ పథకం కింద ఇండో టిబెటన్ బోర్డర్ పోలీస్ (ఐటీబీపీ)తో ఒక అవగాహన ఒప్పందంపై ఉత్తరాఖండ్ సంతకం చేసింది.

కేంద్రీకృత పెట్టుబడులు, సాంకేతికత స్వీకరణ, సంస్థాగత సంస్కరణల ద్వారా భారత ప్రభుత్వం ఆక్వాకల్చర్‌ను వ్యూహాత్మక వృద్ధి ఇంజిన్‌గా నిర్ణయాత్మకంగా ముందుకు నడిపిస్తోంది. ఆర్ఏఎస్, జాతుల వైవిధ్యాన్ని అధిక-విలువైన ఆక్వాకల్చర్‌గా మార్చడం... సామర్థ్యాలను పెంపొందించడం... మౌలిక సదుపాయాల కల్పన వంటి ఆధునిక వ్యవస్థలకు ప్రాధాన్యమివ్వడం ద్వారా ప్రభుత్వం ఈ రంగాన్ని జీవనాధార పద్ధతుల నుంచి సాంకేతికత ఆధారిత, మార్కెట్ ఆధారిత వ్యవస్థగా మారుస్తోంది. ఉత్పాదకతను బలోపేతం చేయడం... రైతుల ఆదాయాన్ని పెంచడం... ప్రాంతీయ పరిమితులను తగ్గించడం... భారత ఆక్వాకల్చర్ సుస్థిరమైన, సులభంగా విస్తరించగల విధానాలతో పెరుగుతున్న దేశీయ డిమాండ్‌ను, పెరుగుతున్న ఎగుమతి అవకాశాలను తీర్చేలా చేయడం ఇందులో ఒక భాగం. జమ్మూ కాశ్మీర్, లదాఖ్, ఉత్తరాఖండ్, హిమాచల్ ప్రదేశ్‌లలో కోల్డ్ వాటర్ ఫిషరీస్ క్లస్టర్లను అభివృద్ధి చేయనున్నట్లు భారత ప్రభుత్వ మత్స్యశాఖ అధికారికంగా ప్రకటించింది.

# గర్భకోశ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

## -శిభిరాన్ని ప్రారంభించిన మడిపల్లి సర్పంచ్ రంజిత్

హన్మకొండ, జనవరి 5:పశువులకు సోకే గర్భకోశ వ్యాది నివారణకు పాడి రైతులు అప్రమత్తంగా ఉండి, పశు వైద్యాధికారులను సంప్రదించాలని మడిపల్లి సర్పంచ్ బుర్ర రంజిత్ కోరారు. ఈ రోజు హన్మకొండ జిల్లా హసన్ పర్తి మండలం మడిపల్లిలో ఉమ్మడి వరంగల్ పశుగణాభివృద్ధి సంస్థ, తెలంగాణ పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు సోకే గర్భకోశ చికిత్స నివారణ శిబిరాన్ని రంజిత్ ప్రారంభించారు. ఈసందర్భంగా రంజిత్ మాట్లాడుతూ పశు సంతతి అభివృద్ధి పర్చుకోవడానికి గర్భకోశ వ్యాధి నివారణ చర్యలు చేపించాలని కోరారు. పశుగణాభివృద్ధి సంస్థ ఈఓ జి సంపత్ రావు శిభిరంలో పాల్గొని మాట్లాడుతూ.. ఈ శీతాకాలంలో పశువులు ఎదకు వస్తాయని,ఎదకురాని పశువులను గర్భకోశ చికిత్స చేసుకొని తగిన మందులు వాడుకొని చూలు కట్టించుకోవాలని సూచించారు. ఆడ దూడల కొరకై సెక్స్ సార్టెడ్ సెమన్ సదుపాయాన్ని రైతులు వినియోగించుకొని ఆడ దూడలను పుట్టించుకోవాలని కోరారు. ఈమేరకు

ఈ కార్యక్రమంలో గ్రామ ఉపసర్పంచ్ కాందారి ప్రదీప్, చింతగట్టు వియల్ఓ బి సురేష్, ఎల్లాపూర్ జెవిఓ శారద గోపాల మిత్ర సూపర్ వైజర్ రాజేశ్వర్ రావు, గోపాల మిత్రులు అనిల్, రాజేష్, రజాక్, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ రోడ్డు భద్రత.. ప్రతి ఒక్కరి బాధ్యత...

## -జిల్లా రవాణాశాఖ అధికారి మహమ్మద్ సంధాని.



జయశంకర్ జిల్లా, జనవరి 5: జాతీయ రోడ్డు భద్రత, ప్రతి ఒక్కరి బాధ్యత అని, భద్రత మాసోత్సవం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని జయశంకర్ జిల్లా రవాణాశాఖ అధికారి మహమ్మద్ సంధాని తెలిపారు. ఈ రోజు భూపాలపల్లి జిల్లా చిట్యాల మండల కేంద్రంలో రహదారి భద్రతా కార్యక్రమం, ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు, ప్రజలతో కలిసి నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని, వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ, హెల్మెట్, సీట్ బెల్ట్ వినియోగంతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా రవాణాశాఖ అధికారి మహమ్మద్ సంధాని పిలుపునిచ్చారు. రోడ్డు విస్తరణ పెరిగినప్పటికీ, వాహనాల సంఖ్య గణనీయంగా పెరగడం వల్ల ప్రమాదాలు అధికమవుతున్నాయని పేర్కొన్నారు. రోడ్డు ప్రమాదాలపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు గత 37 సంవత్సరాలుగా "రోడ్ సేఫ్టీ వీక్" నిర్వహించినప్పటికీ ప్రమాదాలు తగ్గకపోవడంతో, భారత ప్రభుత్వం దీనిని జాతీయ రోడ్ భద్రత మాసోత్సవంగా మార్పు చేసి, ప్రతి సంవత్సరం జనవరి నెల మొత్తం విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు. ఈ మాసోత్సవం ద్వారా రోడ్డు ప్రమాదాలను తగ్గించడమే లక్ష్యంగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో చిట్యాల ఎస్ఐ జి శ్రావణ్ కుమార్, రవాణా శాఖ ఏఎంవిఐ సుందర్ లాల్, శ్రీనివాస్, లెక్చరర్లు, విద్యార్థులు, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సామాజిక సేవాపరమైన రక్షణ ఉండగా... దేని గురించీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు

న్యూ ఢిల్లీ, జనవరి 5:రోడ్డు ప్రమాదం జరిగినప్పుడు, ముఖ్యంగా కీలకమైన 'గోల్డెన్ అవర్'లో సకాలంలో అందే సహాయం ఒక ప్రాణాన్ని కాపాడుతుంది. అలాంటి క్షణాల్లో సహాయం చేయడానికి స్వచ్ఛందంగా ముందుకు వచ్చే వారిని ఆదుకోవడానికి, చట్టపరమైన రక్షణ వారికి కల్పించడానికి రహదారి రవాణా, జాతీయ రహదారుల మంత్రిత్వ శాఖ 2020లో మోటార్ వాహనాల (సవరణ) చట్టం-2019లోని సెక్షన్ 134ం కింద గుడ్ సమారిటన్ నియమాలను ప్రకటించింది. ఈ నియమాలు ఒక సాధారణ నమ్మకం ఆధారంగా రూపొందించారు. వీటి కారణంగా ప్రమాద బాధితుడికి సహాయం చేసేందుకు ఎవరూ భయపడాల్సిన అవసరం ఉండదు. గాయపడిన అపరిచితుడిని వారి వివరాలేవీ తెలియకపోయినా చికిత్స కోసం ధైర్యంగా సమీపంలోని ఆసుపత్రికి తరలించే వ్యక్తులను రాహ్-వీర్స్ అని పిలుస్తారు.

ప్రమాద బాధితుడికి సహాయం చేసే గుడ్ సమారిటన్ (రాహ్-వీర్) చట్టపరమైన చిక్కులు ఎదుర్కొనే పరిస్థితి రాకూడదు. వ్యక్తిగత వివరాలను వెల్లడించమని వారిని బలవంతం చేయకూడదు. వారిని అనవసరంగా నిర్బంధించకూడదు. సహాయం చేయడానికి వచ్చిన వారి సంసిద్ధతను గౌరవించడంతో పాటు వారి గౌరవానికి, గోప్యతకు రక్షణ కల్పించాలి.

తీవ్రమైన గాయం తర్వాత మొదటి గంట సమయాన్ని గోల్డెన్ అవర్‌గా చట్టం నిర్వచిస్తుంది. ఇది వైద్య సహాయం పొందేందుకు అత్యంత కీలక సమయం. ఈ కాలంలో అందించే త్వరిత సహాయంతో శాశ్వత వైకల్యాలు, గాయాలు, అనేక మరణాలనూ నివారించవచ్చు.

ముఖ్యంగా మీరు రాహ్-వీర్ కావడం కోసం మీకు వైద్య శిక్షణ అవసరం లేదు. మీకు ప్రత్యేక పరికరాలేవీ అవసరం లేదు. కొన్నిసార్లు సహాయం చేయాలనే మీ సంకల్పమే అన్నింటికంటే గొప్ప సహాయం అవుతుంది.

# అంధ వికలాంగులకు చేయూతనందించాలి.. ఐఏఎస్ విద్యా సంస్థల డైరెక్టర్ పేరం హేమలత శ్రీకాంత్

కరీంనగర్, జనవరి 5: అంధ వికలాంగులకు చేయూత అందించి వారి విధిరాత మారుద్దామని ఐ.ఏ.ఎస్ విద్యా సంస్థల డైరెక్టర్ పేరం హేమలత శ్రీకాంత్ అన్నారు. గోదావరిఖని ఎల్.బీ నగర్‌లో గల ఇండో అమెరికన్ లో హైదరాబాద్ కు చెందిన ఎస్ఓఎస్ హెచ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అంధ వికలాంగులకు సోమవారం చేయూత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆవె ముఖ్యతిథిగా హాజరై మాట్లాడుతూ విధి వంచితులైన అంధ వికలాంగులు తమ దినచర్యలను చేసుకోవడంలో ప్రతీ నిత్యం ఎన్నో ఒడిదొడుకులు ఎదుర్కొంటారనీ, అలాంటి అధులకు చేయి చేయి కలిపి చేయూత ఇద్దామని సూచించారు.

విద్యార్థులు విద్యార్థి దశ నుంచే సామాజిక సేవా దృక్పథంను అలవర్చుకోవడం వల్ల భవిష్యత్లో ఉన్నత వ్యక్తిత్వంతో గుర్తింపు పొందుతారని పేర్కొన్నారు. ప్రతి విద్యార్థి ఇంటికి వెళ్లాక తమ తల్లిదండ్రులకు అవగాహన కల్పించి అంధులకు ఆర్థిక సహకారం అందించడంలో భాగస్వాములను చేయాలని సూచించారు. సమాజసేవ, క్రమశిక్షణ వైపు నడిపిస్తుందన్నారు.

ఎన్ఓసీహెచ్ సంస్థ ప్రతినిధులు కూడా ఒకప్పుడు విద్యార్థులేననీ, ఆ స్థాయి నుంచే సమాజ సేవకులుగా ఎదిగారని, అంధుల జీవితాల్లో వెలుగులు నింపడానికి ఆ సంస్థకు మనమంతా సహకారం అందిద్దామని పిల్లలచే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎస్ఓ సీహెచ్ ప్రతినిధులు నితిష్ రెడ్డి, రేణుక, ఉపాధ్యాయులు శివ, సునీత, స్వరూపతోపాటు అధిక సంఖ్యలో పిల్లలు పాల్గొన్నారు.

# ప్రజావాణి సమస్యల సత్వర పరిష్కారానికి చొరవ చూపాలి

## -జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య

సంగారెడ్డి, జనవరి 5 (నేటి నిజం ప్రతినిధి) ప్రజావాణి లో వచ్చిన సమస్యల సత్వర పరిష్కారానికి అధికారులు ప్రత్యేక చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అధికారులకు సూచించారు.



కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి వివిధ సమస్యలపై జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అడిషనల్ కలెక్టర్లుమాధురి,పాండు , నారాయణఖేడ్ సబ్ కలెక్టర్ ఉమా హారతిలతో కలిసి వినతులను స్వీకరించారు.

ఈ సందర్భంగా అర్జీదారులు భూ సమస్యలు, ఆసరా పింఛన్లు, ఉద్యోగ కల్పన,తదితర అంశాలతో పాటు పంచాయతి, వ్యవసాయ, హౌసింగ్, లేబర్, పి డబ్ల్యూ డి, డి ఆర్ డి ఓ, మున్సిపల్, రెవెన్యూ, బి సి డి ఓ, మైన్స్, డి ఎస్ సి ఓ తదితర శాఖలకు సంబంధించిన ఫిర్యాదులను కలెక్టర్ కు అందజేశారు. ఆయా వినతులను పరిశీలించి ఎప్పటికప్పుడు పరిష్కరించాలని కలెక్టర్ సంబంధిత శాఖల అధికారులకు ఆదేశించారు. ప్రజావాణి లో 42 అర్జీలు అందాయని తెలిపారు. ఈ సందర్భముగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమమని , అర్జీదారుల సమస్యలను వెంట వెంటనే పరిష్కరించాలని సూచించారు.

ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు, రెవిన్యూ డివిజనల్ అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, కలెక్టరేట్ ఏ ఓ, ప్రజలు, పాల్గొన్నారు .

# శివసేవకుల సేవలు విస్తృతం


## -కార్యనిర్వాహణాధికారి శ్రీనివాసరావు

శ్రీశైలంజనవరి 5: నంద్యాల జిల్లాలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీశైలంలోని భ్రమరాంబిక మల్లికార్జున స్వామి దేవస్థానములో స్వచ్ఛంద సేవను అందిస్తున్న శివసేవకుల బృందాల నిర్వాహకులతో సోమవారం కార్యనిర్వహణాధికారి యం. శ్రీనివాసరావు ప్రత్యేకంగా సమావేశమయ్యారు.

ఈ సమావేశంలో స్వచ్ఛంద సేవకు సంబంధించి పలు సూచనలను జారీ చేశారు. ఈ సందర్భంగా కార్యనిర్వహణాధికారి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు శివసేవకుల స్వచ్ఛందసేవను దేవస్థానం మరింత విస్తృతంగా వినియోగించుకోవడం జరుగుతుందన్నారు. అదేవిధంగా సేవాసమయంలో శివసేవకులకు గుర్తింపు కోసమై దేవస్థానం అధికార చిహ్నం (లోగో)తో స్కార్ఫ్‌ను అందజేస్తుందన్నారు.

శివసేవకులలో తగు అవగాహన పొందేందుకుగాను దేవస్థానం కరదీపికను పాకెట్ సైజు పుస్తకాన్ని కూడా అందజేస్తుందన్నారు. అదేవిధంగా సమయానుకూలంగా శివసేవకులకు దేవస్థానం అవగాహన కార్యక్రమాన్ని కూడా నిర్వహిస్తుందన్నారు. శివసేవకులు క్యూకాంప్లెక్సు, క్యూలైన్ల నిర్వహణ, ఆలయ ప్రాంగణం, అన్నప్రసాద వితరణ, కల్యాణకట్ట మొదలైన చోట్ల స్వచ్ఛందసేవను అందించాలన్నారు. స్వచ్ఛందసేవకులందరు కూడా అంకితభావంతో భక్తులకు సేవలు అందించాలన్నారు. ముఖ్యంగా యాత్రికులతో మర్యాదపూర్వకంగా మెలగాలన్నారు. ప్రతి యాత్రికుడిని కూడా దేవస్థానానికి వచ్చిన అతిథిగా భావించాలన్నారు.

అదేవిధంగా శివసేవకులు వారికి కేటాయించిన ప్రదేశాలలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా సేవలను అందజేయాలన్నారు. శివసేవకులందరు కూడా సమయపాలన పాటించడం ఎంతైనా అవసరమన్నారు. సేవా సమయంలో భక్తులు అడిగే సమాచారాన్ని కూడా సేవకులు ఓపికతో తెలియజేయాలన్నారు. ఈ సాధారణ సమాచారాన్ని దేవస్థానమే శివసేవకులకు సమకూరుస్తుం దన్నారు.దేవస్థాన అధికారులు, సిబ్బంది అందరు కూడా శివసేవకులకు పూర్తి సహాయ సహకారాలు అందిస్తారన్నారు. దేవస్థానం అధికారులతో తగు సమన్వయం చేసుకుంటూ స్వచ్ఛందసేవకులు స్వచ్ఛందసేవలు అందించాలన్నారు. ఈ సమావేశంలో శివసేవకుల విభాగపు సహాయ కార్యనిర్వహణాధికారి కె. వెంకటేశ్వరరావు, పర్యవేక్షకురాలు టి. హిమబిందు తదితర సిబ్బంది, స్వచ్ఛందసేవా సంస్థల నిర్వాహకులు పాల్గొన్నారు.



స్వచ్ఛందసేవకు ఆసక్తిగల వారు ఆన్‌లైన్ ద్వారా కూడా నమోదు చేసుకోవచ్చునన్నారు. ఈ ఆన్‌లైన్ విధానంలో బృందాలుగా లేదా వ్యక్తిగతంగా కూడా స్వచ్ఛందసేవకు నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. శివసేవకులు సేవను నిర్వహించు సమయంలో దేవస్థానమే తాత్కాలిక గుర్తింపుకార్డులను అందజేయడం

# గణతంత్ర దినోత్సవ వేడుకలు 2026.. విజయవంతంగా ముగిసిన రాష్ట్రస్థాయి జాతీయ పాఠశాల బ్యాండ్ పోటీలు

న్యూఢిల్లీ, జనవరి 5: పాఠశాల, దేశం పట్ల పిల్లల్లో ఐక్యత, మమకారం, గర్వాన్ని పెంపొందించేందుకు గణతంత్ర దినోత్సవ వేడుకలు (ఆర్‌డీసీ) 2026లో భాగంగా రాష్ట్రస్థాయిలో నిర్వహించిన జాతీయ పాఠశాల బ్యాండ్ పోటీలు 2025-26 విజయవంతంగా ముగిశాయి. దేశవ్యాప్తంగా జరిగిన ఈ పోటీల్లో విద్యార్థులు ఎంతో ఉత్సాహంగా పాల్గొన్నారు.

ఈ పోటీలు నాలుగు విభాగాల్లో (అబ్బాయిల బ్రాస్ బాండ్, అమ్మాయిల బ్రాస్ బాండ్, అబ్బాయిల పైప్ బ్యాండ్, అమ్మాయిల పైప్ బ్యాండ్) మూడు స్థాయిల్లో (రాష్ట్ర, జోనల్, జాతీయ(ఫైనల్) స్థాయిలో) జరుగుతాయి.

రాష్ట్ర స్థాయి పోటీలకు దేశవ్యాప్తంగా 33 రాష్ట్రాలు, యూటీల నుంచి 824 పాఠశాల బ్యాండ్ బృందాలు నమోదు చేసుకోగా, 18,013 మంది పిల్లలతో కూడిన 763 బృందాలు పాల్గొన్నాయి.

జోనల్ స్థాయి పోటీలకు 94 బృందాలు ఎంపిక య్యాయి. ఒక్కో జోన్ నుంచి తుది పోటీలకు అర్హత సాధించిన నాలుగు బృందాలు అంటే.. నాలుగు జోన్ల (తూర్పు, పశ్చిమ, ఉత్తరం, దక్షిణం) నుంచి మొత్తం 16 బృందాలు జనవరి 24, 2026న న్యూఢిల్లీలో జరిగే గ్రాండ్ ఫినాలేలో పాల్గొంటాయి. రక్షణ మంత్రిత్వ శాఖ నియమించిన ప్రత్యేక జ్యూరీ సభ్యులు ఈ బృందాల ప్రదర్శనలకు నిర్ణేతరులుగా వ్యవహరిస్తారు. ఇందులో భారత రక్షణ రంగంలోని సైన్యం, నావికాదళం, వాయుసేన విభాగ ప్రతినిధులు సభ్యులుగా ఉండి, విజేతలను నిర్ణయిస్తారు.

జాతీయ పాఠశాల బ్యాండ్ పోటీలను ఆర్‌డీసీ-2023 నుంచి రక్షణ మంత్రిత్వ శాఖ, విద్యా మంత్రిత్వ శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్నాయి.

బ్యాండ్ నుంచి వచ్చే లయబద్ధమైన సంగీతం.. పిల్లల్లోనూ, పెద్దల్లోనూ ఉత్సాహాన్ని, ధైర్యాన్ని, కార్యశీలతను ప్రోత్సహిస్తుంది. ఇది దేశవ్యాప్తంగా పాఠశాల విద్యార్థుల్లో దేశభక్తిని, ఐక్యతా భావాన్ని పెంపొందించేందుకు దోహదపడుతుంది. విద్యార్థులను సర్వతోముఖాభివృద్ధి దిశగా ప్రోత్సహిస్తుంది.

# బేటి బచావో బేటి పడావోతో బాలికలకు బంగారు భవిష్యత్

## -జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్యా

### -విద్యా-క్రీడా రంగాల్లో ప్రతిభ చూపిన బాలికలకు అవార్డులు అందజేసిన జిల్లా కలెక్టర్.



సంగారెడ్డి, జనవరి 05(నేటి నిజం (ప్రతినిధి) బేటి బచావో బేటి పడావో కార్యక్రమంతో బాలికల బంగారు భవిష్యత్ కు పునాది పడుతుందని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య అన్నారు.

జిల్లా మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బేటి బచావో బేటి పడావో కార్యక్రమంలో భాగంగా జిల్లాస్థాయిలో విద్యా మరియు క్రీడా రంగాలలో విశేష ప్రతిభ కనబరిచిన విద్యార్థినులకు సోమవారం కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్లో జిల్లా కలెక్టర్ పి. ప్రవీణ్య కిట్లు, అవార్డు సర్టిఫికెట్లు అందజేశారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ,"బాలికలు అన్ని రంగాలలోనూ ముందం జలో నిలుస్తూ జిల్లాకు గర్వకారణంగా మారుతున్నారని, ప్రభుత్వం బాలికల సాధికారతకు అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని సద్విని యోగం చేసుకుని బాలికలు ఉన్నత శిఖరాలను అధిరోహించాలని ఉద్బోధించారు.

విద్యతో పాటు క్రీడల్లో కూడా బాలికలు రాణిస్తూ ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆమె ఆకాంక్షించారు.

కార్యక్రమంలో భాగంగా ప్రతి విద్యార్థికి ఒక బ్యాగ్, ట్రాక్ సూట్, వాటర్ బాటిల్, మోటివేషనల్ పుస్తకం, టీ-షర్ట్‌తో పాటు అవార్డు సర్టిఫికెట్‌ను అందజేశారు.

జిల్లాస్థాయిలో ప్రతిభ కనబరిచి అవార్డులు అందుకున్న విద్యార్థులు ఎం.రంజన్ కుమారి, భావన, మాల్విక, అశ్విని, ఋత్విక రెడ్డి, వైష్ణవి, ఎం. శైలజ, పి. గౌతమి, భూమిక, ప్రవళిక.

ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మాధురి, పాండు , సబ్ కలెక్టర్ ఉమా హారతి,జిల్లా సంక్షేమ అధికారి కె. లలిత కుమారి, జిల్లా సమన్వయకర్త పల్లవి, అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

# 'అందరివాడు' కు ఆత్మీయ సన్మానం

## – ఆర్యవైశ్య మహాసభ వేదికగా సేవా సంకల్పం
## – టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా అధ్యక్షుడు సంతోష్ చక్రవర్తికి సత్కారం

ఖమ్మం, జనవరి 5 (నేటినిజం ప్రతినిధి) : ఖమ్మం గుట్టల బజార్ లోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి



దేవ్యాలయం ప్రాంగణంలో ఖమ్మం జిల్లా ఆర్యవైశ్య మహాసభ జిల్లా కార్యవర్గ సమావేశం, అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు. ఆధ్యాత్మిక వాతావరణంలో జరిగిన ఈ సమావేశానికి జిల్లా నలుమూలల నుంచి ఆర్యవైశ్య సమాజానికి చెందిన నాయకులు, ప్రతినిధులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో తరలి రావడంతో సభకు విశేష ప్రాధాన్యత లభించింది. ఐక్యతే బలమనే భావన సమావేశమంతా ప్రతిధ్వనించింది. సమావేశంలో ఇటీవల ఎన్నికైన గ్రామపంచాయతీ ఆర్యవైశ్య చైర్మన్లు, వార్డు సభ్యులు, చాంబర్ ఆఫ్ కామర్స్, జూబ్లీ క్లబ్, వివిధ దేవాలయాల పాలకవర్గాలకు ఎన్నికైన ఆర్యవైశ్య ప్రతినిధులను వేదికపై ఘనంగా సత్కరించారు. బాధ్యతలు స్వీకరించిన ప్రతి ఒక్కరూ వ్యక్తిగత ప్రయోజనాలకంటే సమాజ హితానికే ప్రాధాన్యం ఇవ్వాలని, సమిష్టి కృషితోనే ఆర్యవైశ్య సమాజానికి గౌరవం పెరుగుతుందని వక్తలు పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజెఎఫ్, హెచ్-2843) ఖమ్మం జిల్లా అధ్యక్షుడు టి.సంతోష్ చక్రవర్తిను ఆహ్వానించి, 'అందరివాడు' గా గుర్తింపు పొందిన ఆయనను సభ వేదికపై ఆత్మీయంగా ఘన సన్మానం చేశారు. నిష్పక్షపాత జర్నలిజంతో ప్రజా సమస్యలను నిరంతరం వెలుగులోకి తీసుకువస్తూ సమాజానికి స్వరంగా నిలుస్తున్న ఆయన సేవలను కొనియాడుతూ శాలువాతో సత్కరించి అభినందనలు తెలిపారు. బాధ్యతాయుతమైన మీడియా ప్రజాస్వామ్యానికి పునాదిగా నిలుస్తుందని నాయకులు స్పష్టం చేశారు. అనంతరం ఆర్యవైశ్య మహాసభ భవిష్యత్ కార్యాచరణపై కీలక చర్చలు జరిపారు. సేవా కార్యక్రమాల విస్తరణ, యువతను సంఘ కార్యకలాపాల్లో భాగస్వామ్యం చేయడం, సాంస్కృతిక విలువల పరిరక్షణ, దేవాలయాల అభివృద్ధి వంటి అంశాలను ప్రాధాన్యంగా తీసుకుంటూ సమాజ శ్రేయస్సే లక్ష్యంగా ముందుకు సాగాలని తీర్మానించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న మండలాల అధ్యక్షులు, కార్యవర్గ సభ్యులు, మహిళా విభాగం నాయకులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేశారు.

# 'విద్యతోనే సామాజిక సాధికారత'

అర్వపల్లి, జనవరి 05 : విద్యతోనే మహిళా, సామాజిక సాధికారత సాధ్యమని సూర్యాపేట జిల్లా జిల్లా కో-ఆర్డినేటర్ చైతన్య అన్నారు. సోమవారం అర్వపల్లి మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో 'బేటీ బచావో బేటీ పడావో' పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చైతన్య మాట్లాడుతూ.. సమాజంలో ఆడపిల్లల పట్ల ఉన్న వివక్షను తొలగించి, వారిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశమన్నారు. బాల్య వివాహాలను అరికట్టాలని, ఆడపిల్లలకు సమాన అవకాశాలు కల్పించినప్పుడే దేశం అభివృద్ధి చెందుతుందన్నారు. ఆడ పిల్లలను రక్షించుకోవడం (బేటీ బచావో), వారిని చదివించడం (బేటీ పడావో) ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. మహిళలు, బాలికల రక్షణ కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న చట్టాలు, హెల్ప్ లైన్ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు స్వర్ణలత, మహిళా సాధికారత కేంద్రం జెండర్ స్పెషలిస్ట్‌లు వినోద్, భవ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# జాతీయస్థాయి రంగోత్సవ్ పోటీలలో స్మార్ట్ కిడ్జ్ విద్యార్థుల ప్రతిభ



ఖమ్మం, జనవరి 5 (నేటినిజం ప్రతినిధి) :జాతీయ స్థాయి రంగోత్సవ్ హ్యాండ్ రైటింగ్, కలరింగ్ పోటీలలో స్మార్ట్ కిడ్జ్ పాఠశాల చిన్నారులు ప్రతిభ కనపరిచి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. పాఠశాలకు చెందిన వివిధ తరగతుల విద్యార్థులు 39 మంది జాతీయ పోటీలలో బహుమతులు గెలుచుకున్నారు.

విజయం సాధించిన విద్యార్థులకు సోమవారం పాఠశాల కరెస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మెడల్స్ ను అందించారు. మెడల్స్ సాధించిన విద్యార్థులు లాస్య ప్రియ, వేధన్య, మోక్షిత్ కృష్ణ, మనీష్, పునర్వి, యోగితారెడ్డి, ప్రణీత శ్రీ, జస్విక్, స్వీకృతి, గాత్రి, అభయ్ కృష్ణ, సాయి స్కందన్, నిరూప, ప్రహాసిని, ధన్విక్, ధాత్రి శ్రీ, కార్తీ సుదీక్ష, సాయిష్, యక్షిత్, వీక్ష, మోక్షశ్రీ, ముబీనలి, చతుర్వేద్, ఆద్య, సహస్ర, దీపక్, హర్షిత, రిషాన్ జాదవ్, పవిత్ర, యశస్విని లకు మెడల్స్ అందించి అభినందించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ చింతనిప్పు కృష్ణ చైతన్య మాట్లాడుతూ... మా పాఠశాల విద్యార్థులు రంగోత్సవ్ జాతీయస్థాయి పోటీలలో మెడల్స్ సాధించి అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక కావడం అభినందనీయం అన్నారు. ప్రతి సంవత్సరం లాగానే ఈ సంవత్సరం కూడా పాఠశాల విద్యార్థులు పలు రాష్ట్ర స్థాయి, జాతీయస్థాయి పోటీలలో బహుమతులు సాధించి పాఠశాల ఖ్యాతిని ఇనుమడింప చేస్తున్నారని పేర్కొన్నారు. చదువుతోపాటు విద్యార్థులను అన్ని రంగాలలో తీర్చిదిద్దడం వలన తమ పాఠశాల విద్యార్థులు ఉన్నత స్థాయి పోటీలలో రాణిస్తున్నారని తెలియజేశారు. ఈ విద్యార్థుల అభినందన కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్ చింతనిప్పు సుకన్య, ప్రిన్సిపల్, ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# ఎన్‌సీసీ ద్వారా భారత భవిష్యత్తు నాయకత్వ నిర్మాణం: ఉప రాష్ట్రపతి

న్యూ ఢిల్లీ, జనవరి 5:న్యూ ఢిల్లీలోని డీజీఎన్‌సీసీ క్యాంప్‌లో నిర్వహించిన నేషనల్ క్యాడెట్ కార్ప్స్ (ఎన్‌సీసీ) గణతంత్ర దినోత్సవ శిబిరం- 2026 ప్రారంభోత్సవానికి భారత ఉపరాష్ట్రపతి శ్రీ సీపీ రాధాకృష్ణన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా దేశ నిర్మాణంలో, యువత అభివృద్ధిలో ఎన్‌సీసీ అందిస్తున్న నిరంతర సేవలను ఆయన ప్రశంసించారు.

క్యాడెట్లకు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలియజేస్తూ.. ఎన్‌సీసీ 78వ సంవత్సరంలోకి అడుగుపెట్టిందని ఉపరాష్ట్రపతి పేర్కొన్నారు. క్రమశిక్షణ, బాధ్యత, దేశభక్తి కలిగిన పౌరులను తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తూ.. ప్రస్తుతం ఇది ప్రపంచంలోనే అతిపెద్ద యూనిఫాం ధరించిన యువజన సంస్థగా ఎదిగిందని ఆయన ప్రశంసించారు. యువతపై దేశానికి ఉన్న విశ్వాసానికి, బలమైన, ఐక్య దేశాన్ని నిర్మించాలనే మనందరి నిబద్ధతకు గణతంత్ర దినోత్సవ శిబిరం శక్తిమంతమైన ప్రతీకగా నిలుస్తుందని అభివర్ణించారు.

ఎన్‌సీసీ నినాదమైన "ఐక్యత, క్రమశిక్షణ" గురించి ప్రస్తావిస్తూ.. ఆత్మవిశ్వాసం, విలువలతో కూడిన యువతను ఈ సంస్థ తీర్చిదిద్దుతోందని, వీరే వికసిత్ భారత్ ఏ2047కు వెన్నెముకగా నిలుస్తారని ఉపరాష్ట్రపతి అన్నారు. ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ దార్శనిక నాయకత్వంలో అభివృద్ధి చెందిన భారత్ వైపు ప్రయాణం... నైపుణ్యం, క్రమశిక్షణ, సేవాభావం కలిగిన యువత శక్తితో ముందుకు సాగుతుందని తెలిపారు. ఆత్మనిర్భర్ భారత్ నిర్మాణంలో ఎన్‌సీసీ కీలక పాత్ర పోషిస్తోందని ఆయన పేర్కొన్నారు.

ఆపరేషన్ సిందూర్ సమయంలో ఎన్‌సీసీ క్యాడెట్లు అందించిన అసాధారణ సేవలను ఉపరాష్ట్రపతి గుర్తుచేసుకున్నారు. దాదాపు 72,000 మంది క్యాడెట్లు పౌర రక్షణ విధుల్లో స్వచ్ఛందంగా పాల్గొన్నారని, క్లిష్ట సమయాల్లో దేశ సేవ చేయడానికి వారికున్న నిబద్ధత, ధైర్యం, అంకితభావాన్ని ఇది చాటిచెబుతోందని ఈయన ప్రశంసించారు.

గణతంత్ర దినోత్సవ ప్రాముఖ్యతను వివరిస్తూ.. ఎన్‌సీసీ గణతంత్ర దినోత్సవ శిబిరం మన రాజ్యాంగ విలువలైన న్యాయం, స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వాలను ప్రతిబింబిస్తుందని చెప్పారు. విభిన్న రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల నుంచి వచ్చిన క్యాడెట్లు ఒకే చోట కలిసి నివసిస్తూ, శిక్షణ పొందుతూ జాతీయ ఐక్యత భావాన్ని చాటుతున్నారని పేర్కొన్నారు.

సాహస క్రీడలు, అంతర్జాతీయ యువజన మార్పిడి కార్యక్రమాలు, పర్యావరణ కార్యక్రమాలు, విపత్తు సహాయ చర్యల్లో ఎన్‌సీసీ క్యాడెట్లు చూపుతున్న ప్రతిభను ఉపరాష్ట్రపతి కొనియాడారు. ముఖ్యంగా కేరళలోని వయనాడ్ వరదల సమయంలో వారు అందించిన సేవలను ఆయన ప్రత్యేకంగా కొనియాడారు.

ఎన్‌సీసీ శిక్షణను ఆధునీకీకరించడాన్ని ఉపరాష్ట్రపతి స్వాగతించారు. ముఖ్యంగా సైబర్ సెక్యూరిటీ, డ్రోన్ శిక్షణను ప్రవేశపెట్టడం, రిమోట్ పైలట్ ట్రైనింగ్ అకాడమిని ఏర్పాటు చేయడం వంటి నిర్ణయాలను ఆయన ప్రశంసించారు. ఇలాంటి కార్యక్రమాలు భవిష్యత్తులో ఎదురయ్యే సాంకేతిక, భద్రతా పరమైన సవాళ్లను ఎదుర్కొనేలా యువతను సిద్ధం చేస్తాయని ఆయన పేర్కొన్నారు. యువత ఆలోచనలను సరైన దిశలో మలిచి, దేశ గౌరవాన్ని పెంచే విధంగా వారి వ్యక్తిత్వాన్ని తీర్చిదిద్దుతున్న ఎన్‌సీసీ అధికారులు, శిక్షకులు, సిబ్బంది చూపుతున్న అంకితభావాన్ని ఆయన ప్రత్యేకంగా అభినందించారు.

ఎన్‌సీసీ గణతంత్ర దినోత్సవ శిబిరం-2026లో పాల్గొంటున్న క్యాడెట్లందరికీ ఉపరాష్ట్రపతి శుభాకాంక్షలు తెలిపారు. సేవ, క్రమశిక్షణ, దేశభక్తి అనే అత్యున్నత ఆశయాలను ఎల్లప్పుడూ కాపాడాలని వారికి పిలుపునిచ్చారు.

అంతకముందు శిబిరానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి ఎన్‌సీసీ క్యాడెట్ల గౌరవ వందనాన్ని స్వీకరించారు. అనంతరం 'హాల్ ఆఫ్ ఫేమ్' ను సందర్శించి, ఎన్‌సీసీ చరిత్ర, సాధించిన విజయాలు, అభివృద్ధి ప్రయాణం గురించి వివరాలు తెలుసుకున్నారు. యువ ఆపద మిత్ర పథకం, డ్రోన్ శిక్షణ వంటి కార్యక్రమాలను ప్రదర్శించే స్టాళ్లను ఆయన సందర్శించారు. విపత్తు నిర్వహణలో ఎన్‌సీసీ చేపడుతున్న చర్యలు, ఆధునిక సాంకేతికతలను అందిపుచ్చుకోవడంలో సంస్థ చేస్తున్న కృషిని ఉపరాష్ట్రపతి అభినందించారు అనంతరం క్యాడెట్లు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాన్ని వీక్షించి, వారితో ముచ్చటించారు.. క్యాడెట్ల క్రమశిక్షణ, ఉత్సాహం, దేశభక్తి భావాన్ని ఆయన ప్రశంసించారు.

ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ డైరెక్టర్ జనరల్ లెఫ్టినెంట్ జనరల్ వీరేంద్ర వత్స్, ఇతర ఉన్నతాధికారులు, శిక్షకులతోపాటు దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన క్యాడెట్లు పాల్గొన్నారు.

# వారి సమస్యలు పరిష్కరిస్తాం

## -పెదనలో బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీ హాల్ భవనాన్ని
## -ప్రారంభించిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్ కె ఎస్ జవహర్



అమరావతి, జనవరి 5: బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీ సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకువెళ్లి త్వరలోనే పరిష్కరిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, మాజీ మంత్రి కె ఎస్ జవహర్ తెలిపారు. ఇవాళ ఉదయం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎస్సీ కమిషన్ చైర్మన్, పెదన నియోజకవర్గ శాసనసభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్, జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ ఛైర్మన్ బండి రామకృష్ణతో కలసి పెదన పట్టణం 10 వ వార్డులోని రాజీవ్ నగర్ లో నూతనంగా నిర్మించిన బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీ హాల్ భవనాన్ని ప్రారంభోత్సవం చేశారు.

అనంతరం ఏర్పాటు చేసిన సభలో ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ మాట్లాడుతూ బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీ తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల్లో షెడ్యూల్డ్ కులాలుగా పరిగణించబడ్డారని, అయితే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో వారు కుల ధృవీకరణ పత్రాలు పొంద లేకపోవడం బాధాకరమన్నారు. దీనివల్ల వారు విద్యావకాశాలతో పాటు ఇతర రంగాలలో ఎంతో నష్టపోతున్నారని, దీనిని ప్రభుత్వ దృష్టికి తీసుకుని శాశ్వత పరిష్కారం పొందే విధంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. రాష్ట్రంలో బేడ (బుడ్గ) జంగం కమ్యూనిటీ హక్కుల కోసం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు యలమర్తి మధు ఎన్నో ఉద్యమాలు, పోరాటాలు చేస్తూ వారి అభ్యున్నతికి ఎంతో కృషి చేస్తున్నారని ఆయన ఈ సందర్భంగా అభినందించారు. అదేవిధంగా నిధులు కోసం ఎవరిని అభ్యర్థించకుండా కుల సంఘస్తులే సొంతగా కమ్యూనిటీ హాల్ భవనాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు.

పెదన నియోజకవర్గ శాసన సభ్యుడు కాగిత కృష్ణ ప్రసాద్ మాట్లాడుతూ బేడ(బుడ్గ) జంగం కమ్యూనిటీకి కుల ధ్రువీకరణ పత్రం జారీ చేయకపోవడం ప్రధాన సమస్యగా ఉందని, దీనివలన ప్రభుత్వ పథకాలు పొందడంలో, విద్యా అవకాశాల్లో ఆటంకంగా మారిందని పేర్కొన్నారు. గతంలో ఈ సమస్యను రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు దృష్టికి తీసుకువెళ్లడం జరిగిందని గుర్తు చేస్తూ, మరల ఏపీ ఎస్సీ కమిషన్ చైర్మన్ సహకారంతో ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని, తలెత్తే ఎలాంటి సమస్యకైనా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం కూటమి ప్రభుత్వం పెన్షన్లు, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, సంవత్సరానికి 3 ఉచిత గ్యాస్ సిలిండర్లు, తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ వంటి సంక్షేమ పథకాలను అమలు చేస్తూ సూపరిపాలన అందిస్తున్నామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వ సహకారంతో రాష్ట్రాన్ని అన్ని విధాలుగా అభివృద్ధి పథంలో ముందుకు తీసుకువెళుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బేడ బుడ్గ జంగం కమ్యూనిటీ రాష్ట్ర అధ్యక్షుడు యలమర్తి మధు, పెదన మున్సిపల్ వైస్ చైర్మన్ బైలపాటి జ్యోతి, పదో వార్డు పార్టీ ఇంచార్జ్ వంకా ప్రసాద్, కుల సంఘ నాయకులు పస్తం వాకలయ్య, కూటమి నాయకులు కొండపల్లి దుర్గారావు, దాసరి సత్యనారాయణ, డెక్కల శ్యామలయ్య, కమ్మగట్టి బాబు తదితర నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

# పిప్రహ్వా అవశేషాలను తిరిగి స్వదేశానికి తీసుకురావటం యాజమాన్య హక్కు కాదు.. సంరక్షణ బాధ్యత

న్యూ ఢిల్లీ, జనవరి 5:ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ప్రారంభించిన పవిత్ర పిప్రహ్వా అవశేషాల భారీ అంతర్జాతీయ ప్రదర్శన సందర్భంగా న్యూఢిల్లీలోని రాయ్ పిథోరా సాంస్కృతిక భవనంలో బౌద్ధ తత్వశాస్త్రంపై ప్యానెల్ చర్చ నిర్వహించారు.

నలందలోని నవ నలంద మహావిహార (డీమ్డ్ విశ్వవిద్యాలయం) వైస్-ఛాన్సలర్ ప్రొఫెసర్ సిద్ధార్థ్ సింగ్ అధ్యక్షతన ఈ కార్యక్రమం జరిగింది. లక్నోలోని బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం మాజీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ నళిన్ కుమార్ శాస్త్రి, ఢిల్లీ విశ్వవిద్యాలయం ఫిలాసఫీ విభాగం ప్రొఫెసర్ బాల గణపతి, లక్నోలోని బాబాసాహెబ్ భీమ్‌రావ్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ ఆనంద్ సింగ్,న్యూఢిల్లీలోని జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం సంస్కృత విభాగం ప్రొఫెసర్ రజనీశ్ మిశ్రా, కోల్‌కతా విశ్వవిద్యాలయం బౌద్ధ అధ్యయన విభాగం మాజీ విభాగాధిపతి ప్రొఫెసర్ ఉజ్వల్ కుమార్‌తో పాటు పలువురు ప్రముఖ విద్యాంసులు ప్యానెల్ సభ్యులుగా పాల్గొన్నారు.

కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ప్రొఫెసర్ సిద్ధార్థ్ సింగ్ ప్రసంగిస్తూ.. బలప్రయోగం లేదా ఒత్తిడి ద్వారా కాకుండా, సంభాషణ, నైతిక విలువలు, వ్యక్తిగతంగా ఆదర్శంగా తీసుకోవటం ద్వారా బుద్ధుని బోధనలు ప్రపంచవ్యాప్తంగా విస్తరించినట్లు తెలిపారు. ధర్మం ఆధారంగా ఉండే ఇతర సంప్రదాయాల లాగే బౌద్ధమతం కూడా మత మార్పిడికి కాక మానవాళి మనసును శుద్ధి చేయటం, బాధల నుంచి విముక్తి కలిగించటంపై దృష్టి సారిస్తుందని చెప్పారు. వర్తమాన ఆచరణకర్తలను చారిత్రక బుద్ధునితో అనుసంధానిస్తూ, సజీవ సంప్రదాయాలను కొనసాగించటంలో బుద్ధుని అవశేషాలు తోడ్పడుతున్నాయని స్పష్టం చేశారు. పిప్రహ్వా అవశేషాలను తిరిగి స్వదేశానికి తీసుకురావటమనేది కేవలం యాజమాన్య హక్కుకు సంబంధించిన విషయం కాదని, ఉమ్మడి వారసత్వ సంరక్షణ బాధ్యతకు నిదర్శనమని చెప్పారు.

పిప్రహ్వా అవశేషాలను తిరిగి స్వదేశానికి తీసుకురావటం.. శాంతి, సమగ్ర జాతీయ అభివృద్ధికి మార్గదర్శిగా పునరుద్ధరించిన బౌద్ధ తత్వశాస్త్ర ప్రాముఖ్యతను ప్రతిబింబిస్తుందని ప్రొఫెసర్ నళిన్ కుమార్ శాస్త్రి అన్నారు. నైతిక పాలన, పర్యావరణ సుస్థిరత, మానసిక ఆరోగ్యం వంటి సమకాలీన అంశాలతో ప్రాచీన జ్ఞానాన్ని బౌద్ధ చింతన అనుసంధానిస్తుందని తెలిపారు. సామాజిక సామరస్యం, పర్యావరణ బాధ్యత, ప్రపంచ సంక్షేమానికి అనత్త, బ్రహ్మవిహారాలు, ప్రతీత్యసముత్పాదం వంటి బోధనలు అత్యవసరమన్నారు. ధర్మానికి మాతృభూమిగా భారత్ పాత్రను ఆయన స్పష్టం చేశారు.

బుద్ధుడు, ఆయన శిష్యుల అవశేషాలు కేవలం చిహ్నాలు మాత్రమే కాదని, ధర్మానికి సజీవ స్వరూపాలని ప్రొఫెసర్ ఆనంద్ సింగ్ స్పష్టం చేశారు. బుద్ధుని ఉనికిని, ఆయన బోధనలను ఇవి ఏకకాలంలో ప్రతిబింబిస్తాయన్నారు. స్థూపాలు, చైత్యాల ద్వారా పవిత్ర బౌద్ధ క్షేత్రాలు విస్తరించటంలో ఈ అవశేషాల ఆరాధన కీలక పాత్ర పోషించిందని తెలిపారు. మౌలిక తాత్విక విలువలను కోల్పోకుండానే, ఆదిబుద్ధ భావనలను, మాతృదేవత ఆరాధన వంటి స్థానిక సాంస్కృతిక అంశాలను బౌద్ధమతం మిళితం చేసుకుందని చెప్పారు.

దార్శనికత, సార్వత్రిక నైతిక విలువలే ప్రపంచవ్యాప్తంగా బౌద్ధమతం ఆదరణ పొందటానికి ముఖ్య కారణాలని ప్రొఫెసర్ బాల గణపతి స్పష్టం చేశారు. పిప్రహ్వా అవశేషాలను బుద్ధుని సందేశానికి సజీవ చిహ్నాలుగా అభివర్ణిస్తూ, ధర్మానికి మాతృభూమిగా భారత నాగరికత పాత్రను తెలియజేశారు. విచ్ఛిన్నమవుతున్న నేటి ప్రపంచంలో శాంతి, పరస్పర సహకారం, నైతిక స్పష్టతకు ఆచరణాత్మక, మానవీయ మార్గాన్ని బౌద్ధ దర్శనం చూపుతుందని అభిప్రాయపడ్డారు.

బౌద్ధ దర్శనానికి, ప్రాచీన భారతీయ చింతనకూ మధ్య లోతైన తాత్విక, గ్రంథపరమైన కొనసాగింపును ప్రొఫెసర్ రజనీశ్ మిశ్రా తెలిపారు. శ్రమణ, బ్రాహ్మణ సంప్రదాయాల మధ్య ఉమ్మడి మేధో వాతావరణాన్ని ప్రముఖంగా ప్రస్తావించారు. వారణాసి వంటి విద్యా కేంద్రాలు చారిత్రక కాలం నుంచి చర్చలు, వాదోపవాదాలు, తాత్విక పరిణతికి వేదికలుగా నిలిచాయని అన్నారు.

బుద్ధుడి మొదటి బోధనలకు వారణాసి సమీపంలోని సారనాథ్‌ను ఎంచుకోవటంలోని ఉద్దేశ్యాన్ని ప్రొఫెసర్ ఉజ్వల్ కుమార్ వివరించారు. ఈ సందర్భంగా బౌద్ధ ధర్మ సిద్ధాంతాల్లోని స్థూపం, చైత్యం మధ్య వ్యత్యాసాన్ని స్పష్టం చేశారు. బుద్ధుని, ఇతర గొప్ప గురువుల పవిత్ర అవశేషాలతో ఉండేది స్థూపం.. బుద్ధుని గౌరవార్థం, స్మారకార్థం నిర్మించిన పవిత్ర చిహ్నం, చైత్యమని తెలిపారు. బౌద్ధుల నైతిక, భక్తిపూర్వక జీవితంలో ఈ రెండూ కీలకమని చెప్పారు.

# అజ్ఞానమనే చీకటిని తొలగించే వాడే గురువు: స్వామి స్మరణానంద



హైదరాబాద్, జనవరి 5: యోగదా సత్సంగ సొసైటీ వ్యవస్థాపకుడు, ఒక యోగి ఆత్మకథ రచయిత పరమహంస యోగానంద జయంతి వేడుకలు దేశ వ్యాప్తంగా ఘనంగా జరిగాయి. తిరుపతి నలందా నగర్‌లో నూతన ధ్యాన కేంద్రాన్ని వైఎస్ ఎస్ స్వామి స్మరణానంద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అజ్ఞానమనే చీకటిని తొలగించే వాడే గురువని చెప్పారు. భగవంతుడి నిశ్శబ్ద స్వరమే గురువని, సాధన అంటే దయ, క్షమ, సేవా తత్పరత అలవరచుకోవడమేనన్నారు. హైదరాబాద్ మధురానగర్‌లోని సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్ లో వైఎస్ ఎస్ భక్తులు క్రియాయోగ ధ్యానం, భజనలు, పుష్పాంజలి నిర్వహించారు.

పరమహంస యోగానంద పశ్చిమ దేశాలలో, భగవంతునిపై భక్తి, క్రమబద్ధమైన ధ్యానం అన్ని నిజమైన మతాల ఐక్యతను నొక్కిచెబుతూ, అవిశ్రాంతంగా బోధించారు,. కేవలం విశ్వసించడమే కాకుండా, భగవంతుడిని నేరుగా అనుభూతి చెందమని ఆయన సాధకులను ప్రోత్సహించారు. ఆయన ఆధ్యాత్మిక మహా గ్రంథం, ఒక యోగి ఆత్మకథ, లక్షలాది హృదయాలను స్పృశించి, ఆత్మలను ఈశ్వర సాక్షాత్కార మార్గం వైపునకు నిరంతరం ఆకర్షిస్తూ ఉంది. ఆయన రచనలు ప్రాచ్య, పాశ్చాత్య ఆధ్యాత్మిక సంప్రదాయాలలో ఒకేలా ఉన్న సార్వత్రిక సత్యాలను మరింతగా వెల్లడిస్తాయి.

యోగానంద జయంతి సందర్భంగా, దివ్యమైన ఆయన మార్గదర్శనాన్ని కోరుకునే శ్రద్ధగల సాధకులు యోగానంద సాన్నిధ్యాన్ని అనుభూతి చెందుతూనే ఉన్నారు. శాశ్వత ఆనందం కోసమైన అన్వేషణ?భక్తి, క్రమశిక్షణ, దైవ కృప ద్వారాభగవంతుని యందే నెరవేరుతుందని ఆయన మనకు హామీ ఇస్తున్నారు.

# అసెంబ్లీ సాక్షిగా చెప్పిన అబద్ధాలపై ఆగ్రహం!

హైదరాబాద్ జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అసెంబ్లీ సాక్షిగా అబద్ధాలను గొప్పగా వల్లెవేసిన సీఎం రేవంత్ రెడ్డికి ఏపీలోని చంద్రబాబు సర్కార్ గట్టి షాక్ ఇచ్చింది. చంద్రబాబు మీద ఒత్తిడి తీసుకొచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆపించానని.. ఇదీ తన చరిత్ర అంటూ చెప్పుకున్న గొప్పలను ఖండించింది. రేవంత్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు అసంబద్ధమని పేర్కొంది.జగన్ హయాంలో అనుమతులు లేకుండా రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టు పనులు చేపట్టారని ఏపీ ప్రభుత్వం తెలిపింది. రాయలసీమకు రోజుకు 3 టీఎంసీలు అంటూ ప్రకటనతో జగన్ ప్రభుత్వం ఈ పనులు చేపట్టిందని.. జగన్ ప్రచారంతో లిఫ్ట్ పనులపై అప్పటి తెలంగాణ ప్రభుత్వం కోర్టులో కేసు వేసిందని పేర్కొంది. కేంద్రం, ఎన్‌జీటీతో పాటు పలుచోట్ల ఫిర్యాదు చేసిందని చెప్పింది. తెలంగాణ ఫిర్యాదులను విచారించి.. అనుమతులు లేనందున పనులు నిలిపివేయాలని 2020లోనే ఎన్‌జీటీ, కేంద్రం ఆదేశాలిచ్చిందని వివరించింది. 2024లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాకముందే కేంద్రం పనులు నిలిపివేయించిందని స్పష్టం చేసింది.చంద్రబాబు కేంద్రంగా తెలంగాణలో అధికార పార్టీ రాజకీయ లబ్ధి పొందే ప్రయత్నం చేస్తుందని ఏపీ ప్రభుత్వం ఆరోపించింది. ఏపీ నీటి హక్కులు, సీమ సాగునీటి ప్రయోజనాల విషయంలో రాజీ ఉండబోదని స్పష్టం చేసింది. రాయలసీమ లిఫ్ట్ ప్రారంభించిన విధానం, అనుమతులు, పనుల నిలిపివేతపై ఆధారాలతో సహా వాస్తవాలు బయటపెడతామని ఏపీ ప్రభుత్వం తేల్చిచెప్పింది. ఇందుకు సంబంధించిన ఆధారాలను ఏపీ ఇరిగేషన్ శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ప్రెస్‌మీట్ పెట్టి విడుదల చేస్తారని స్పష్టం చేసింది.

తెలంగాణ అసెంబ్లీలో కృష్ణా నదీ జలాలపై శనివారం నిర్వహించిన స్వల్పకాలిక చర్చలో సీఎం రేవంత్ రెడ్డి బీఆర్ఎస్‌ను విమర్శిస్తూ గొప్పలు చెప్పుకున్నారు. వైఎస్ జగన్‌కు పంచభక్ష పరమాన్నాలు పెట్టి.. కేసీఆర్ భుజం తట్టి ప్రోత్సహిస్తే.. నేను చంద్రబాబుపై ఒత్తిడి తీసుకొచ్చి రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును ఆపించా.. ఇదీ నా చరిత్ర అని రేవంత్ రెడ్డి తెలిపారు.' రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు ఆపితేనే మేం ఏదైనా విషయాలపై చర్చకు వస్తామని చంద్రబాబుకు సూటిగా చెప్పా. నా మాట మీద గౌరవంతో చంద్రబాబు ఆ పనులు ఆపించారు. ఆ పనులు ఆగాయో.. లేదో తేల్చేందుకు నిజనిర్ధారణ కమిటీని పంపిం చండి. కూనంనేని సాంబశివ రావు, అక్బరుద్దీన్ ఒవైసీ, బీజేపీ మహేశ్వర్ రెడ్డితో ఆ కమిటీని వేయండి. కావాలంటే గతంలో సాగునీటిపారుదల శాఖ మంత్రులుగా పనిచేసిన కేసీఆర్, హరీశ్‌రావు ఇద్దరిలో ఒకరిని దీనికి చైర్మన్‌గా నియమించి విచారణకు పంపించండి. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత, ఉత్తమ్ కుమార్ రెడ్డి మంత్రి అయిన తర్వాత రాయల సీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ఆగాయో లేదో తేల్చుకోండి ' అంటూ అసెంబ్లీ సాక్షిగా రేవంత్ రెడ్డి అబద్ధాలను కూడా చాలా గొప్పగా చెప్పుకున్నారు. కానీ వెంటనే చంద్రబాబు సర్కార్ రేవంత్ గాలి తీసేసింది. రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు పూర్తిగా అసంబ ద్ధమని తేల్చిచెప్పింది.

# 'అందరికీ విషంపెట్టి చంపెయ్ పీడ పోతది'

### వంటమనిషికి ఫోన్‌చేసిన హాస్టల్ వార్డెన్ కిషన్ నాయక్ వెంటనే రియాక్ట్ అయిన జిల్లా కలెక్టర్.. హాస్టల్ వార్డెన్ సస్పెండ్

సంగారెడ్డి జనవరి 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );: గురుకుల పాఠశాలలో విద్యార్థులను తల్లీతండ్రీ అన్నీ తానై చూసుకోవాల్సిన హాస్టల్ వార్డెన్ ఒక వీధి రౌడీలా ప్రవర్తించారు. హాస్టల్‌లో వసతులు సరిగా లేవని విద్యార్థులు రోడ్డెక్కడంతో అతను ఆగ్రహం వ్యక్తంచేశాడు. వంటమనిషికి ఫోన్‌చేసి విద్యార్థులను దూషించాడు. అంతేగాక 'అందరికీ విషంపెట్టి చంపెయ్ పీడ పోతది' అని వ్యాఖ్యానించాడు. ఆ మాటలకు సంబంధించిన వీడియో వైరల్ అయ్యింది.సంగారెడ్డి జిల్లాలోని సిర్గాపూర్ ఎస్సీ గురుకుల పాఠశాలలో ఈ ఘటన చోటుచేసుకుంది. దీనిపై జిల్లా కలెక్టర్ వెంటనే రియాక్ట్ అయ్యారు. హాస్టల్ వార్డెన్ కిషన్ నాయక్‌ను విధుల నుంచి సస్పెండ్ చేశారు. కాగా గడిచిన 10 రోజులుగా హాస్టల్‌లో కరెంట్ లేదని, వార్డెన్‌ను అడిగితే తాగివచ్చి బూతులు తిడుతున్నాడని విద్యార్థులు ఇటీవల రోడ్డుపై బైఠాయించారు. దాంతో తనపైనే ఫిర్యాదు చేస్తారా అంటూ కోపంతో పిల్లలను బూతులు తిట్టాడు.'అందరికీ విషం పెట్టి చంపెయ్ పీడ పోతది' అంటూ వంట మనిషికి ఫోన్‌చేసి చెప్పాడు. అందుకు సంబంధించిన ఆడియో సోషల్ మీడియాలో వైరల్ అయ్యింది. దాంతో విషయం కలెక్టర్ దృష్టికి వెళ్లింది. కలెక్టర్ వెంటనే వార్డెన్ కిషన్ నాయక్‌ను విధుల నుంచి తొలగించారు.

# మాధవ సేవా సమితి ఆధ్వర్యంలో 164 మంది పిల్లలకు స్వర్ణామృత ప్రాసన చుక్కల మందు




కరీంనగర్, జనవరి 5: (నేటినిజం ప్రతినిధి) మాధవ సేవా సమితి కరీంనగర్ శాఖ ఆధ్వర్యంలో సోమవారం రోజునమాధవ నిలయం లోస్వర్ణామృత ప్రాసన చుక్కల మందు పంపిణీ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో 164 మంది పిల్లలు స్వర్ణామృతప్రాసన చుక్కల మందును ఉపయోగించు కున్నారు.ఈ కార్యక్రమంలో ప్రాంత కార్యావాహ ఆదరనీయ కాచం రమేష్ , మాధవ సేవా సమితి అధ్యక్షులు సీఏ నిరంజనా చారి., మానవీయ జిల్లా సహ సంఘ చాలక ఎలగందుల సత్యనారాయణ , విభాగ్ సహ కార్యవాహ మురళి జీ , సమితి కార్యదర్శి కామరపు ప్రసాద్ పాల్గొన్నారు.

# పిల్లల్లో క్యాల్షియం లోపం రాకుండా ఉండాలంటే వారికి ఇవి తినిపించాలి



హైదరాబాద్ జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఎదిగే పిల్లలకు అవసరమయ్యే పోషకాల్లో క్యాల్షియం కూడా ఒకటి. ఎముకలు, దంతాలు, పిల్లల అభివృద్ధికి క్యాల్షియం చాలా అవసరం. మన శరీరంలో క్యాల్షియం ఎక్కువ భాగం ఎముకల్లోనే నిల్వ చేయబడి ఉంటుంది. మన శరీరంలో దాదాపు 99 శాతం క్యాల్షియం ఎముకల్లోనే ఉంటుంది. పిల్లలకు క్యాల్షియం చాలా అవసరం. క్యాల్షియం లోపించడం వల్ల ఎముకలు బలహీన పడడంతో పాటు ఎముకల్లో పగుళ్లు వచ్చే అవకాశం కూడా ఉంది. శరీరంలో తగినంత క్యాల్షియం లేకపోవడం వల్ల ఎముకలు క్షీణిస్తాయి. అంతేకాకుండా శరీరం ఎముకల నుండి క్యాల్షియాన్ని తీసేసి ఇతర చోట్ల వినియోగిస్తుంది. మన శరీరం ఉండే ఎముకలు చిన్నతనంలోనే క్యాల్షియాన్ని కూడబెట్టే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. వయసు పెరిగే కొద్దీ ఎముకలు క్యాల్షియాన్ని నిలుపుకునే సామర్థ్యాన్ని కోల్పోతాయి. చిన్నతనంలో ఎముకల సాంద్రత గరిష్ట స్థాయికి చేరుకుంటుంది. కనుక పిల్లలకు క్యాల్షియం ఉండే ఆహారాలను ఇవ్వడం చాలా అవసరం. పిల్లల క్యాల్షియం అవసరాలను తీర్చే ఆహారాల గురించి పోషకాహార నిపుణులు వివరిస్తున్నారు.

నల్ల నువ్వులు..

నల్లనువ్వులు క్యాల్షియం అద్భుతమైన మూలం అని చెప్పవచ్చు. విటమిన్ బి కాంప్లెక్స్, ప్రోటీన్, మంచి కొవ్వులు వీటిలో అధికంగా ఉంటాయి. నువ్వులతో నువ్వుల చిక్కీ చేసి పిల్లలకు ప్రతిరోజూ ఆహారంలో భాగంగా ఇవ్వడం వల్ల వారికి తగినంత క్యాల్షియం అందుతుంది. పెరుగు సులభంగా కరిగే క్యాల్షియాన్ని కలిగి ఉంటుంది. పెరుగును తీసుకోవడం వల్ల ఎముకలు దృఢంగా మారడంతో పాటు రోగనిరోధక శక్తి కూడా పెరుగుతుంది. కనుక పిల్లలకు పెరుగును రోజూ ఆహారంలో భాగంగా ఇవ్వడం అలవాటు చేసుకోవాలి. రాజ్మా, కాబూలీ చనా, బ్లాక్ చనా, గ్రీన్ చనా వంటి పప్పు దినుసుల్లో క్యాల్షియం పుష్కలంగా ఉంటుంది. రోజూ ఒక పప్పును పిల్లలకు ఆహారంలో భాగంగా ఇవ్వడం వల్ల క్యాల్షియం లోపం లేకుండా ఉంటుంది.

ఆకుకూరలు..

ఆకుకూరల్లో కూడా క్యాల్షియం ఎక్కువగా ఉంటుంది. మెంతి, పాలకూర, ముల్లంగి ఆకులు, పుదీనా, కొత్తిమీర వంటి వాటిల్లో క్యాల్షియం ఎక్కువగా ఉంటుంది. ఈ ఆకుకూరలను పిల్లలకు రోజువారీ ఆహారంలో భాగంగా ఇవ్వడం వల్ల వారిలో ఎముకలు దృఢంగా ఉండడంతో పాటు ఆరోగ్యానికి కూడా మేలు కలుగుతుంది. వాల్ నట్స్, అంజీర్, ఖర్జూరం, ఆప్రికాట్ వంటి వాటిల్లో కూడా క్యాల్షియం ఎక్కవగా ఉంటుంది. అలాగే వీటిలో ప్రోటీన్, కొవ్వులు, విటమిన్లు వంటి పోషకాలు కూడా ఉంటాయి. వీటిని రోజూ పిల్లలకు ఇవ్వడం వల్ల క్యాల్షియం లోపంతో పాటు పోషకాహార లోపం కూడా లేకుండా ఉంటుంది. ఈ విధంగా పిల్లలకు రోజూ క్యాల్షియం ఉండే ఆహారాలను ఇవ్వడం వల్ల వారిలో ఎదుగుదల చక్కగా ఉంటుంది. ఎముకలు బలంగా తయారవ్వుతాయి. బాల్యంలో ఉండే బలమైన ఎముకలే జీవితాంతం మన ఎముకల ఆరోగ్యానికి మూలం. కనుక పిల్లల ఎముకలను దృఢంగా, ఆరోగ్యంగా ఉంచే ఆహారాలను వారికి ఇవ్వడం చాలా అవసరమని పోషకాహార వైద్యులు చెబుతున్నారు.

# సంస్కృత వేదపాఠశాలలో ఉచిత విద్యా భోధనకు మార్చి 15 నుండి ఇంటర్వ్యూలు

హరిద్వార్ జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );హరిద్వార్‌లోని ఆచార్య పాణిగ్రహి చతుర్వేద సంస్కృత వేదపాఠశాలలోఉచిత విద్యా భోదనకు మార్చి 15 నుండి జూలై 15, వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నట్లు పాఠశాల నిర్వాహకులు హీరాలాల్ జీ తెలిపారు.హిందూవులు తన కొడుకును హరిద్వార్ గురుకుల్‌లో చదువు కోసం చేర్చాలనుకుంటే, ఈ అవకాశాన్ని సద్వినియోడం చేసుకోవాలని ఒక ప్రకటనలో తెలిపారు."ఆ పిల్లవాడు 6వ తరగతి ఉత్తీర్ణుడై ఉండాలి."గురుకులంలో వసతి, ఆహారం మరియు అన్ని ఇతర సౌకర్యాలు పూర్తిగా ఉచితం. అదనంగా, నెలకు రూ.8,000 స్కాలర్‌షిప్ కుడా అందించబడుతుంది. పిల్లవాడు నాలుగు వేదాలు, వ్యాకరణం, సాహిత్యం, ఇంగ్లీష్ మరియు ఇతర ఆధునిక విషయాలలో విద్యను పొందుతాడు. గురుకుల్ వేదాలలో నిపుణుడిగా మారడానికి మరియు ఎంఏ వరకు ఉన్నత చదువులకు మార్గదర్శకత్వం అందించడానికి కూడా సహాయపడుతుంది.ఈ అవకాశం హిందువులకు మాత్రమే అని స్పష్టం చేసారు.

# తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శిగా డాక్టర్ పాలకుర్తి కృష్ణ ఎన్నిక



ఖమ్మం, జనవరి 5 (నేటినిజం ప్రతినిధి) :హైదరాబాదులో సోమవారం బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్లో జరిగిన తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర కమిటీ ప్రమాణ స్వీకారానికి విచ్చేసిన విద్యార్థి నరాల సత్యనారాయణ, తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర చైర్మన్, తెలంగాణ పొలిటికల్ జేఏసీ రాష్ట్ర జనరల్ సెక్రెటరీ డాక్టర్ బత్తుల సోమయ్య, తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఉన్నటువంటి ఉద్యమకారులు, నాయకులు పాల్గొని రాష్ట్ర కమిటీ నియామక పత్రం అందజేసి ఎవరి బాధ్యతలు వారికి అప్పగించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తెలంగాణ సీనియర్ ఉద్యమకారుడు డాక్టర్ పాలకుర్తి కృష్ణ ఈ సందర్భంగా కార్యదర్శిగా ఎన్నికై నియామక పత్రం అందుకొని బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ...తెలంగాణ రాష్ట్రం ఏర్పడడానికి ఎందరో ప్రాణత్యాగం చేశారని, ఉద్యమకారుల త్యాగాలు లాటిలు, తూటాలు లెక్కచేయకుండా ప్రాణాల్ని ప్రాణంగా పెట్టి చావుకు భయపడకుండా ముందుకు వెళ్లిన నా తోటి ఉద్యమకారుల కు న్యాయం చేయాలని కోరారు, ఈ రాష్ట్రం సిద్ధించే వరకు ఎవరైతే పోరాటం చేశారో వారి యొక్క మనోభావాలు గుర్తించి గత ప్రభుత్వం టిఆర్ఎస్ ఉద్యమకారులకి ఏమీ చేయలేదు అందుకే ఆ పార్టీ మనుగడ లేకుండా పోయింది, సోనియా గాంధీ తెలంగాణ ఇచ్చింది, దాంతో పాటు అమరవీరుల కుటుంబాలను ఆదుకుంటాన ని ఉద్యమకారులకి న్యాయం చేస్తానని మీ రాష్ట్రం మీకు ఇస్తానని ఇచ్చిన మాట నిలబెట్టుకున్న సోనియా గాంధీ ఆనాడు ప్రచారానికి వచ్చిన రాహుల్ గాంధీ, తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హామీ ఇచ్చి రెండు సంవత్సరాలు గడిచింది, ఉద్యమకారులకి 250చదరపు గజాల స్థలం పెన్షన్, గౌరవ వేతనం ఇస్తానని ఆనాడు మాటిచ్చిన కాంగ్రెస్ పార్టీ మాట తప్పితే తెలంగాణ పొలిటికల్ జేఏసీ ఖచ్చితంగా ఈ ప్రభుత్వం మెడలు వంచి పోరాటం చేసి సాధించుకుంటామని ఈ సందర్భంగా తెలియజేశాడు. ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసిన ప్రతి ఒక్కరికి ఉద్యమకారులు డాక్టర్ బత్తుల సోమయ్య ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

# డివిజన్లో ఓటర్ జాబితా మార్పు చేయాలని, తప్పులను సరిదిద్దాలని బిజెపి నేతల ఫిర్యాదు...



కరీంనగర్, జనవరి 5: (నేటినిజం ప్రతినిధి) కరీంనగర్ నగరపాలక సంస్థ 7, 36, 51, 64 డివిజన్ ల ఓటరు జాబితాలో అనేక తప్పిదాలు, పొరపాట్లు , అవకతవకలు జరిగాయని, తక్షణం ఓటర్ లిస్టు సవరణ చేయాలని ఆయా డివిజన్ల బిజెపి నేతలు , కాంటెస్టెడ్ కార్పొరేటర్లు తోట సాగర్, తోట అనిల్ , కొమ్మెర రవీందర్ రెడ్డి, బండారి ఆంజనేయులు, శాన గోండశ్రీనివాస్ (వాసు) లు సోమవారం రోజున జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్లకు ఫిర్యాదు చేశారు. ఏడవ డివిజన్ హౌసింగ్ బోర్డు, సదాశివ పల్లి కలిపి గతంలో 5207 ఓట్లు ఉంటే తాజాగా ప్రకటించిన ముసాయిదాలో ఓటర్ల సంఖ్య 6846 కి చేరిందని , దాదాపు 1279 మంది ఓట్లు కరీంనగర్ పట్టణంలోని లోని వివిధ ప్రాంతాల నుండి నమోదు అయ్యాయని, డివిజన్ కు సంబంధంలేని పోలింగ్ బూతు కేంద్రాల నుండి ఆ ఓట్లు ఏడో డివిజన్లో నమోదు అయ్యాయని, అలాగే అనేక బోగస్ ఓట్లు కూడా డివిజన్లో నమోదు అయ్యాయని, తక్షణం ఈ విషయంపై చర్యలు తీసుకొని, ఓటర్ జాబితాను సవరించాలని కంటెస్టెడ్ కార్పొరేటర్ తోట సాగర్ సోమవారం రోజున జిల్లా కలెక్టర్కు ప్రజావాణిలో ఫిర్యాదు చేసి వినతిపత్రం సమర్పించారు. 36వ డివిజన్ ఓటర్ లిస్టులో అనేక అవకతవకలు జరిగాయని , దాదాపు లక్ష్మీనగర్ కు చెందిన దాదాపు 200 ఓట్లు, గ్రామీణ ప్రాంతాల ఓట్లు 36వ డివిజన్లో నమోదు చేశారని, వెంటనే వాటిని తొలగించి ఓటరు జాబితాను సవరించాలని బిజెపి నేత తోట అనిల్ ఆధ్వర్యంలో కొంపల్లి సాగర్, తిరుమణి కరుణాకర్, చింతల ప్రభాకర్, కమటం చందు , రాధారపు శ్రీకాంత్, కొయ్యల కారి క్రాంతి, దర్శనాల కృష్ణ, పల్లెర్ల రనేష్ లు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. 51 డివిజన్లో మాజీ కార్పొరేటర్ ఇంటి నంబరు 3-7-329, 322, 293 ల పై 42 అక్రమ ఓట్లు నమోదయాయని, అలాగే డివిజన్ మొత్తంగా 400 ఓట్లు నమోదు అయ్యాయని , వెంటనే ఆ ఓట్లను తొలగించడానికి చర్యలు తీసుకోవాలని బిజెపి నేతలు కొమ్మెర రవీందర్ రెడ్డి, బండారి ఆంజనేయులు మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు.64 వ డివిజన్ ఓటరు జాబితా సవరణ చేయాలని కార్పొరేటర్ శానగోండ శ్రీనివాస్ (వాసు) మున్సిపల్ కమిషనర్ కు ఫిర్యాదు చేశారు. గతంలో 60 వడివిజన్ నేడు 64వ డివిజన్ అయిందనీ ,అయితే ప్రస్తుత 64వ డివిజన్లో ఓటర్ జాబితాలో అనేక పొరపాట్లు , తప్పిదాలు జరిగాయని, 64 డివిజన్ ఓటర్ జాబితాను సవరించడానికి తగిన చర్యలు చేపట్టాలని వాసు అధికారులను కోరారు.

## మూసారాంబాగ్ లో ఘనంగా లూయీ బ్రెయిల్ 217వ జయంతి ఉత్సవాలు

హైద్వేరాబాద్ జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);అంధుల అక్షర ప్రధాత డాక్టర్ లూయీ బ్రెయిల్ 217వ జయంతి ఉత్సవాలను ఆదివారం మూసారాంబాగ్ ఎఫ్ కే ఫంక్షన్ హాల్ లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో అంధులు పాల్గొన్నారు.ఈ కార్యక్రమానికి త్రిశూల్ రెస్టారెంట్ చైర్మన్ రంగు వెంకటేష్ గౌడ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు.అనంతరం వెంకటేష్ గౌడ్ మాట్లాడుతూ గత 16 సంవత్సరాలుగా అంధుల అక్షర ప్రధాత డాక్టర్ లూయీ బ్రెయిల్ జయంతి ఉత్సవాలలో పాల్గొంటూ అన్నదాన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా నిర్వాహకులు వెంకటేష్ గౌడ్ ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో సెలబ్రేషన్ కమిటీ అధ్యక్షుడు సిహెచ్ శ్రీను, ప్రధాన కార్యదర్శి ఆర్. శ్యామ్, ఉపాధ్యక్షుడు ఎన్. నరేష్, సంయుక్త కార్యదర్శి ఎండి షరీఫ్, కోశాధికారి రవి గౌడ్, డిఎన్ సేవాసమితి వ్యవస్థాపక అధ్యక్షుడు డిఎన్ నర్సింగ్ రావు, కాంగ్రెస్ సీనియర్ నాయకుడు రామ్మోహన్ రావు, స్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

# రిజర్వేషన్లపై ఉన్న 50 శాతం పరిమితిని ఎత్తివేసే వరకు దేశ వ్యాప్తంగా పోరాడుతాం

**–బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు కల్పించాల్సిందే**
**–చట్ట సభలలో బీసీల వాటా బీసీలకు దక్కే వరకు బిసిలు పోరు ఆగదు**
**–మహిళా బిల్లులు లో బీసీ మహిళలకు సబ్ కోట ఉండాల్సిందే**
**–కాకినాడలో జరిగిన బీసీ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్**




హైదరాబాద్(కాకినాడ ) జనవరి 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ );దేశంలో సామాజిక రిజర్వేషన్లపై ప్రస్తుతం అమలులో ఉన్న 50% పరిమితిని తక్షణమే రద్దుచేసి జనాభా దామాషా ప్రకారం బీసీ రిజర్వేషన్లను కల్పించాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు లు కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు .కాకినాడ పట్టణ కేంద్రంలో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పంపన రామకృష్ణ ఆధ్వర్యంలో ముందుగా దూరంగి నుండి బి హబ్ కన్వెన్షన్ హాల్ వరకు మోటార్ సైకిల్ ద్వారా భారీ ర్యాలీ తీశారు మార్గ మధ్యన జ్యోతిబాపూలే అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం బీ హబ్ కన్వెన్షన్ హాల్లో బీసీ సంక్షేమ సంఘం రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్, ఏపీ రాష్ట్ర అధ్యక్షులు కేసన శంకర్రావు లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీసీ సంక్షేమ సంఘం గత మూడు దశాబ్దాలుగా చేసిన పోరాట ఫలితంగా దేశవ్యాప్తంగా సమగ్ర కులగనన చేపట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని, కులగనన ఆధారంగా బీసీలకు జనాభా దామాషా ప్రకారం విద్యా ఉద్యోగ రాజకీయ రంగంలో రిజర్వేషన్ పెంచాలని వారు డిమాండ్ చేశారు అగ్రకులాలకు ఈడబ్ల్యూఎస్ పేరుతో 10% రిజర్వేషన్ల కల్పించినప్పుడు 50% రిజర్వేషన్ల పరిమితి దాటిపోయిందని, బీసీ రిజర్వేషన్లు పెంచాలనే డిమాండ్ చేసినప్పుడు మాత్రమే 50% పరిమితిని ముందుకు తీసుకురావడం ఎంతవరకు సమంజసం వారు ప్రశ్నించారు మహిళా బిల్లు లో బీసీ మహిళలకు సబ్ కోట కల్పించాలని, కేంద్రంలో బీసీలకు ప్రత్యేక మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయాలని, సుప్రీంకోర్టు హైకోర్టు న్యాయమూర్తుల నియమకాలలో బీసీ ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్ కల్పించాలని వారు డిమాండ్ చేశారు ఇక ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తక్షణమే సమగ్ర కులగన చేపట్టడానికి డెడికేటెడ్ కమిషన్ ఏర్పాటు చేసి, సమగ్రమైన కులగనన చేపట్టి ఎన్నికల హామీ ప్రకారం బీసీ రిజర్వేషన్ 34% శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు దేశవ్యాప్తంగా బీసీ డిమాండ్ల సాధన కోసం రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఒత్తిడి పెంచి కేంద్రంలో బీసీల తరపున చక్రం తిప్పాలని వారు సూచించారు కాకినాడ జిల్లాకు మల్లాడి సత్య లింగాల నాయకర్, గుంటూరులోని పల నాడు జిల్లా కు ప్రగాఢ కోటయ్య జిల్లాగా, రాష్ట్రంలోని ప్రధాన విమానాశ్రయం కి గౌత లచ్చన్న పేరు పెట్టాలని వారు డిమాండ్ చేశారు .హక్కుల కోసం రాజకీయ పార్టీల కు అతీతంగా బీసీలంతా కలిసికట్టుగా పోరాడాలని పోరాడితేనే విద్యా ఉద్యోగం రాజకీయ రంగాల్లో బీసీలకు జనాభా దామరస్ ప్రకారం వాటా దక్కుతుందని వారు తెలిపారు గల్లి నుండి ఢిల్లీ వరకు అనేక పోరాటాలు చేసి అనేక విజయాలు సాధించామని బీసీలకు తిమంగా రాజ్యాధికారం సాధించడం లక్ష్యంగా ముందుకు సావుగాలని జాజుల శ్రీనివాస్ గౌడ్ కేశన శంకర్రావు పిలుపునిచ్చారు ఈ సమావేశానికి రాష్ట్ర అధికార ప్రతినిధి పంపని రామకృష్ణ ఆధ్వర్యంలో గుత్తుల రమణ పర్యవేక్షణలో బీసీ ఉద్యోగుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సంసాని శ్రీనివాసరావు నేతృత్వంలో జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో బీసీ నాయకులు యనమల కృష్ణుడు, శ్రీనివాస్ రాజు, భవాని, నాగేశ్వరరావు, కృష్ణ, సూర్యచందర్, రాజేశ్వర రావు, నారాయణ గౌడ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, జాతీయ

Printed, Published and owned by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telangana. Published at SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana.'Editor: **BAISA DEVADAS.**
RNI No.52865/93. E-mail :netinijam93@gmail.com